


మన **జనప్రగతి**

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

MJP NEWS TELUGU

సంపుటి : 6 సంచిక : 38 పేజీలు : 8 వెల : రూ.2/- శుక్రవారం 06 మార్చి 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## గోదావరి పుష్కరాల కోసం తెలంగాణ
# కేబినెట్ సబ్ కమిటీ

**కమిటీ చైర్మన్‌గా మంత్రి శ్రీధర్ బాబు.. కన్వీనర్‌గా దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి**

**గోదావరి పుష్కరాల నిర్వహణపై 9 మందితో కూడిన కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు**

**2027 జూలై 23 నుంచి ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలు**

**ప్రధాన ఆలయాలు, ఘాట్ల వద్ద శాశ్వత ఏర్పాట్లు చేయాలని సీఎం రేవంత్ ఆదేశం**

**కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు, ప్యాకేజీ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న ప్రభుత్వం**

**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 05:** తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న గోదావరి పుష్కరాలకు (2027) ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించింది. 'దక్షిణ కుంభమేళా'గా పిలిచే ఈ మహా క్రతువు నిర్వహణ, ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది మంది సభ్యులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి**మిగతా 2లో...**





## రెండు రాజ్యసభ స్థానాలకు
# కాంగ్రెస్ నామినేషన్

**అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్ పత్రాల దాఖలు**

సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన నరేందర్ రెడ్డికి దక్కిన అవకాశం

అసెంబ్లీలో కాంగ్రెస్‌కు పూర్తి బలం.. ఏకగ్రీవ ఎన్నిక లాంఛనమే

ఈ నెల 16న ఎన్నికలు.. నామినేషన్లకు నేడే చివరి రోజు



**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 05:** తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, సీఎం రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ఇవాళ నామినేషన్లు దాఖలు చేశారు. శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు నాయకత్వంలో వీరు తెలంగాణ అసెంబ్లీలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డికి తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు హాజరయ్యారు. **మిగతాది 2లో...**



# ముగిసిన నితీశ్ శకం

**రాజ్యసభకు నామినేషన్ వేసిన నితీశ్ కుమార్**

**బీహార్ సీఎం పదవిని చేపట్టబోతున్న బీజేపీ!**

**సీఎం రేసులో సామ్రాట్ , నిత్యానంద , దిలీప్ జైశ్వాల్**

**పాట్నా,మన జనప్రగతి మార్చి 05:** బీహార్ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం పాటు ముఖ్యమంత్రిగా చక్రం తిప్పిన నితీశ్ కుమార్, రాష్ట్ర రాజకీయాల నుంచి తప్పుకుని జాతీయ రాజకీయాల వైపు అడుగులు వేయడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఆయన త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నారు. **మిగతా 2లో...**

# తెలంగాణలో భానుడి భగభగ...

**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 05:** తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగతో పగటిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మార్చి మొదటి వారంలోనే ఎండలు తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. గురువారం ములుగు జిల్లా మంగపేటలో **మిగతా 2లో......**



**ములుగులో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు**

**పెరుగుతున్న పగటిపూట ఉష్ణోగ్రతలు**

**ఆదిలాబాద్, ఖమ్మం, జగిత్యాలలో అత్యధిక ఉష్ణోగ్రతలు**

**వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచన**

# మూసీ పేరుతో దోపిడీ

**బీఆర్ఎస్ హయాంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేశామన్న కేటీఆర్**

**ప్రజల ఆస్తులకు నష్టం చేయకుండా అభివృద్ధి చేయవచ్చని నిరూపించామన్న కేటీఆర్**

**సుందరీకరణ పనులు తమకు అప్పగిస్తే రూ.16 వేల కోట్లకే చేసి చూపిస్తామని సవాల్**

**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 05:** విధ్వంసం చేయకుండా, ఎవరి ఇళ్లు కూల్చకుండా కూడా అభివృద్ధి, సుందరీకరణ పనులు చేయవచ్చని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. **మిగతా 2లో...**



# తెలుగు రాష్ట్రాల్లో టెన్త్ పరీక్షలకు రెడీ

**తెలంగాణలో 14 నుంచి, ఏపిలో 16 నుంచి పరీక్షలు**

**వాట్సాప్ ద్వారా హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్‌కు అవకాశం**

**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 05:** తెలుగు రాష్ట్రాల్లో పదో తరగతి పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు విడుదలయ్యాయి. తెలంగాణలో మార్చి14 నుంచి.. ఏపీలో16 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పరీక్షలకు ఇంకా కొన్ని రోజులు మాత్రమే గడువు ఉంది. దీంతో ఆయా రాష్ట్రాల ఎస్-ఎస్‌సీ బోర్డులు **మిగతా 2లో...**



# చర్చలు, దౌత్యంతోనే సమస్యలకు పరిష్కారం

**ఫిన్లాండ్ అధ్యక్షుడు స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు**


**ఉగ్రవాద నిర్మూలనే ఇరువురి ఉమ్మడి లక్ష్యం అని ప్రకటన**

**వలసలు, మొబిలిటీపై భారత్, ఫిన్లాండ్ కీలక ఒప్పందం**

**విద్యా రంగంలో పరస్పర సహకారానికి నిర్ణయం**

**న్యూ ఢిల్లీ,మన జనప్రగతి మార్చి 05:** ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ మరోసారి శాంతి మంత్రం జపించింది. కేవలం సైనిక చర్యలతో ఏ సమస్యా పరిష్కారం కాదని, చర్చలు, దౌత్యమే సరైన మార్గమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గురువారం నాడు ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు.

**మిగతా 2లో...**



## కుటుంబ నియంత్రణ నుంచి
# జనాభా పెరుగదల లక్ష్యం

**దేశంలో తగ్గుతున్న ఫర్టిలిటీ రేటు**

**రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదు**

**2047 నాటికి జనాభాలో 23 శాతం మంది వృద్ధులు**

**ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడేవారికి ప్రభుత్వం ప్రోత్సాహం**

**పాపులేషన్ పాలసీపై చర్చ జరగాలి**

**అసెంబ్లీలో డ్రాఫ్ట్ ప్రవేశ పెట్టిన సిఎం చంద్రబాబు**

**అమరావతి,మన జనప్రగతి మార్చి 05:** జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ లాంటి దేశాల్లో ఫెర్టిలిటీ రేట్ తగ్గుతోందని.. భారత్‌తో పాటు ఏపీ లాంటి రాష్ట్రాల్లోనూ ఈ తరహా పరిస్థితే నెలకొందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ 1.5గా ఉందని.. 1993లో ఇది 3.0గా నమోదైందని సీఎం వివరించారు. టీఎఫ్ఆర్ వేగంగా తగ్గితే పని చేసే వయస్సులో ఉన్నవారి సంఖ్య గణనీయంగా తగ్గి, ఆర్థిక వృద్ధి మందగిస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఆర్థిక వ్యవస్థకు నష్టం **మిగతా 2లో...**




2లో

# టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరిన భారత్...

**బెతెల్ మెరుపు సెంచరీ వృథా**

**ముంబై వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన సెమీఫైనల్లో భారత్ విజయం**

**మొదట బ్యాటింగ్ చేసి 253 పరుగుల భారీ స్కోరు సాధించిన టీమిండియా**

**భారత్ తరఫున సంజు శాంసన్, ఇంగ్లండ్ తరఫున బెతెల్ మెరుపు ఇన్నింగ్స్**

**ఆఖరి ఓవర్లో ఉత్కంఠ నడుమ 7 పరుగుల తేడాతో ఇంగ్లండ్ ఓటమి**

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
06 -03-2026

## తెలంగాణలో భానుడి భగభగ...

(మొదటి పేజీ తరువాయి)

అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, ఖమ్మం, జగిత్యాలలో 38.9 డిగ్రీలు, మంచిర్యాలలో 38.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. వృద్ధులు, పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ములుగు, ఆదిలాబాద్, జగిత్యాల, ఖమ్మం, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, కుమురంభీమ్, నాగర్ కర్నూలు, నిజామాబాద్ తదితర జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, సిద్దిపేట తదితర జిల్లాల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

# ముగిసిన నితీశ్ శకం



(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో, బీహార్ తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే చర్చ పెద్ద ఎత్తున జరుగుతోంది.
ప్రస్తుత అంచనాల ప్రకారం, కొత్త ప్రభుత్వంలో బీజేపీ ముఖ్యమంత్రి పదవిని దక్కించుకోనుంది. ఈ రేసులో ప్రధానంగా ముగ్గురు నేతల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వారు ఎవరంటే...?
సామ్రాట్ చౌదరి: ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరి సీఎం రేసులో అందరికంటే ముందున్నారు. ఓబీసీ (కుష్వాహా) సామాజికవర్గానికి చెందిన ఆయనకు పార్టీలో, ప్రభుత్వంలో పట్టు ఉండటం ప్లస్ పాయింట్.నిత్యానంద రాయ్: కేంద్ర మంత్రిగా ఉన్న నిత్యానంద రాయ్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. యాదవ సామాజికవర్గానికి చెందిన ఈయనను సీఎంగా చేయడం ద్వారా, ఆర్జేడీ (తేజస్వి యాదవ్) ఓటు బ్యాంకుకు గండి కొట్టాలని బీజేపీ భావిస్తోంది. అమిత్ షాతో నిత్యానంద రాయ్ కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.దిలీప్ జైశ్వాల్: బీహార్ మంత్రి దిలీప్ జైశ్వాల్ పేరు కూడా పరిశీలనలో ఉంది. వైశ్య సామాజికవర్గానికి చెందిన ఈయనకు పార్టీ అధిష్ఠానం వద్ద మంచి గుర్తింపు ఉంది.

## తెలుగు రాష్ట్రాల్లో టెన్త్ పరీక్షలకు రెడీ

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షల హాల్‌టికెట్లను గురువారం విడుదల చేశాయి. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థుల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లలో వేర్వేరుగా అందుబాటులో అధికారులు ఉంచారు. తెలంగాణలో విద్యార్థులు తమ హాల్‌టికెట్లను బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్ , ఏపీ విద్యార్థులు వాట్సాప్‌లో హాల్ టికెట్లు పొందవచ్చు. ఇక ఏపీ విద్యార్థులు మనమిత్ర (వాట్సాప్ నంబర్ 9552300009) లేదా లీప్ యాప్ ద్వారా.. అలాగే తెలంగాణ విద్యార్థులు వాట్సప్ నంబర్ (8096958096) ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలా కుదరకుంటే.. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద నుంచి కూడా ఈ పరీక్ష హాల్ టికెట్లను విద్యార్థులు పొందవచ్చు. తెలంగాణ అభ్యర్థులు 8096958096 వాట్సప్ నంబర్‌కు హాయ్ అని సందేశం చేయగానే మీ ఫోన్‌కి వెల్‌కమ్‌టూ మీ సేవ అని వస్తుంది. చాట్‌లో టైప్ చేసి మెసేజ్ చేయండి. మీ మొబైల్‌కు ఒక లింక్ వస్తుంది. ఆ లింక్‌ను ఓపెన్ చేసి జిల్లా, పాఠశాల పేరును ఎంచుకోండి.
విద్యార్థి పేరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే హాల్‌టికెట్ మీ ఫోన్‌లోనే వస్తుంది. ఈ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి భద్రపరుచుకోండి. ఏపీలో వాట్సప్‌లో డౌన్‌లోడ్ ఇలా.. మీ ఫోన్‌లో 552300009 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపాలి. సర్వీస్ సెలక్షన్ అనే ఆప్షన్ వస్తుంది. ఎడ్యుకేషన్ సర్వీసెస్‌ను ఎంచుకోండి.అక్కడ ఎస్ఎస్సీ హాల్‌టికెట్ అనే ఆప్షన్‌ను సెలక్ట్ చేసుకోవాలి. అప్లికేషన్ నంబర్/ చైల్డ్ ఐడీతోపాటు పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేయాలి. రెగ్యులర్/ప్రైవేట్/ ఓఎస్ఎస్-సీ రెగ్యులర్/ఒకేషనల్‌లలో మీకు సంబంధించిన కేటగిరీని ఎంచుకొని కన్‌ఫర్మ్ చేయాలి. ఆ తర్వాత కొన్ని నిమిషాలకు హాల్‌టికెట్ మీ వాట్సప్ నంబర్‌కే వస్తుంది. ఈ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి భద్రపరుచుకోవాలని సూచించారు.

## టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరిన భారత్...



**ముంబై, మన జనప్రగతి మార్చి 05:** ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్ 2026 రెండో సెమీఫైనల్లో పరుగుల వరద పారింది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఈ హైస్కోరింగ్ సమరంలో ఇంగ్లండ్ పై భారత్ 7 పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్ లోకి ప్రవేశించింది. ఇంగ్లండ్ బ్యాటర్ జాకబ్ బెతెల్ (105) వీరోచిత సెంచరీతో పోరాడినప్పటికీ, ఆఖరి ఓవర్లో రనౌట్ రూపంలో వెనుతిరగడంతో ఇంగ్లండ్ ఆశలు ఆవిరయ్యాయి.254 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (5), కెప్టెన్ బట్లర్ (25), హ్యారీ బ్రూక్ (7) త్వరగానే పెవిలియన్ చేరారు. ఈ దశలో జాకబ్ బెతెల్ ఒంటరి పోరాటం చేశాడు. భారత బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 48 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 105 పరుగులు చేసి మ్యాచ్ ను మలుపు తిప్పాడు. అతనికి విల్ జాక్స్ (35) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరి దూకుడుతో ఒకానొక దశలో ఇంగ్లండ్ గెలిచేలా కనిపించింది. అయితే ఆఖరి ఓవర్లో ఇంగ్లండ్ విజయానికి 30 పరుగులు అవసరం కాగా, శివమ్ దూబే బౌలింగ్ కు దిగాడు. మొదటి బంతికే డేంజర్ మ్యాన్ బెతెల్ రనౌట్ కావడంతో మ్యాచ్ భారత్ వైపు తిరిగింది. జోఫ్రా ఆర్చర్ చివర్లో వరుసగా మూడు సిక్సర్లు బాదినప్పటికీ, అప్పటికే ఆలస్యం కావడంతో ఇంగ్లండ్ 246 పరుగులకే పరిమితమైంది. మొత్తమ్మీద ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 246 పరుగులు చేసింది. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్యా 2 వికెట్లు తీయగా, బుమ్రా, అర్ష్‌దీప్, అక్షర్, వరుణ్ తలో వికెట్ పడగొట్టారు. అంతకుముందు, టాస్ గెలిచిన ఇంగ్లండ్ బౌలింగ్ ఎంచుకోగా, భారత బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఓపెనర్ సంజు శాంసన్ ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 42 బంతుల్లోనే 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 89 పరుగులు చేసి ఇన్నింగ్స్ కు గట్టి పునాది వేశాడు. మరోవైపు ఇషాన్ కిషన్ (39), శివమ్ దూబే (43) దూకుడుగా ఆడగా, చివర్లో తిలక్ వర్మ (7 బంతుల్లో 21), హార్దిక్ పాండ్యా (27) మెరుపులతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇంగ్లండ్ బౌలర్లలో ఆర్చర్ 61 పరుగులు సమర్పించుకోగా, జాక్స్, రషీద్ చెరో రెండు వికెట్లు తీశారు.ఈ విజయంతో భారత్ టైటిల్ పోరుకు సిద్ధమైంది. టీ20 ప్రపంచకప్ లో టీమిండియా వరుసగా రెండోసారి ఫైనల్ చేరింది. 2024లో టీమిండియా ఛాంపియన్ గా నిలవడం తెలిసిందే. ఇక, టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ లో టీమిండియా.... న్యూజిలాండ్ తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ టైటిల్ సమరం మార్చి 8న అహ్మదాబాద్‌లో జరగనుంది.

# చర్చలు, దౌత్యంతోనే సమస్యలకు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో నెలకొన్న ఘర్షణలను ముగించేందుకు జరిగే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని మోదీ హామీ ఇచ్చారు. చట్టం, న్యాయం, ప్రజాస్వామ్య విలువలపై భారత్, ఫిన్లాండ్‌లకు ఒకే రకమైన అభిప్రాయం ఉందని ఆయన తెలిపారు.
ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని ఇరువురు నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ నిర్మూలించడమే తమ ఉమ్మడి లక్ష్యమని మోదీ పేర్కొన్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ 'ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్' పూర్తి చేయడాన్ని ప్రస్తావిస్తూ మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మీరు ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్ పూర్తి చేశారు.. మీలాంటి శక్తివంతమైన నాయకత్వంతో భారత్, ఫిన్లాండ్ కూడా ఇన్నోవేషన్, డిజిటల్, సస్టైనబిలిటీ అనే కొత్త 'ట్రయాథ్లాన్'ను సాధిస్తాయని నాకు నమ్మకం ఉంది" అని మోదీ చమత్కరించారు.

**కొత్త శకంలో భారత్-యూరప్ బంధం**

ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి మధ్య ఉందని, ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచంలోని రెండు పెద్ద దౌత్య శక్తులైన భారత్, యూరప్ మధ్య సంబంధాలు స్వర్ణయుగంలోకి ప్రవేశిస్తున్నాయని ఆయన అభివర్ణించారు. 2026 ప్రారంభంలో కుదిరిన చారిత్రాత్మక 'ఇండియా-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' గురించి ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఒప్పందం ద్వారా భారత్, ఫిన్లాండ్ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**కీలక ఒప్పందాలపై సంతకాలు**

ఇరు దేశాల మధ్య ఆవిష్కరణల వ్యవస్థను అనుసంధానించేందుకు సమగ్ర 'మైగ్రేషన్ అండ్ మొబిలిటీ' (వలసలు మరియు రాకపోకల) ఒప్పందంపై సంతకాలు చేసినట్లు ప్రధాని ప్రకటించారు. భారతీయ విద్యార్థులకు, ప్రతిభావంతులకు ఫిన్లాండ్ ఇప్పుడు ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా మారుతోందన్నారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య పరిశోధనలు, స్టార్టప్ సహకారం మరింత బలపడుతుందని తెలిపారు. విద్యా రంగంలో ఫిన్లాండ్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడిన మోదీ.. ఉపాధ్యాయ శిక్షణ, స్కూల్-టు-స్కూల్ భాగస్వామ్యం, భవిష్యత్ విద్యా విధానాలపై సహకారాన్ని విస్తరించుకోవడానికి అంగీకరించినట్లు వెల్లడించారు. నార్డిక్ ప్రాంతంలో ఫిన్లాండ్ భారత్‌కు ముఖ్యమైన భాగస్వామి అని, ఆర్కిటిక్, ధృవ ప్రాంతాల పరిశోధనల్లోనూ తమ సహకారం కొనసాగుతుందని మోదీ స్పష్టం చేశారు.

## రెండు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్ నామినేషన్

(మొదటి పేజీ తరువాయి)

అంతకుముందు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఈ ఇద్దరి పేర్లను అధికారికంగా ప్రకటించింది. జాతీయ స్థాయిలో పార్టీకి న్యాయపరమైన అంశాల్లో కీలకంగా వ్యవహరిస్తున్న సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీకి కాంగ్రెస్ అధిష్ఠానం మరోసారి అవకాశం కల్పించింది. ఆయన వాగ్ధాటి, పార్లమెంటులో చురుకైన పాత్ర పార్టీకి ఆస్తిగా భావిస్తోంది. ఇక, రెండో అభ్యర్థిగా పలువురు సీనియర్ నేతల పేర్లు ప్రచారంలో ఉన్నప్పటికీ, అధిష్ఠానం మాత్రం సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, ఆయన సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి వైపు మొగ్గు చూపింది.
ప్రస్తుతం సిట్టింగ్ సభ్యులుగా ఉన్న అభిషేక్ మను సింఘ్వీ, కేఆర్ సురేశ్ రెడ్డిల పదవీకాలం ఏప్రిల్ 9తో ముగియనుండటంతో ఈ ఎన్నికలు అనివార్యమయ్యాయి. 2024లో కాంగ్రెస్‌లో చేరిన కె. కేశవరావు రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి సింఘ్వీ ఎన్నికైన విషయం తెలిసిందే. ఇక, కేఆర్ సురేశ్ రెడ్డి ప్రస్తుతం బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్నారు.
ఈ నెల 16న రాజ్యసభ ఎన్నికల పోలింగ్ జరగనుండగా, నామినేషన్ల దాఖలుకు ఇవాళే చివరి రోజు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపకపోవడంతో కాంగ్రెస్ అభ్యర్థులు ఇద్దరూ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. 119 మంది సభ్యులున్న తెలంగాణ అసెంబ్లీలో రెండు స్థానాలను గెలుచుకోవడానికి అవసరమైన సంఖ్యాబలం అధికార కాంగ్రెస్ పార్టీకి ఉంది. కాంగ్రెస్‌కు 66 మంది ఎమ్మెల్యేలు ఉండగా, మిత్రపక్షం సీపీఐకి ఒక సభ్యుడు ఉన్నారు. కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా భావించే ఎంఐఎంకు ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. మరోవైపు బీఆర్ఎస్‌కు అధికారికంగా 37 మంది సభ్యులు ఉన్నప్పటికీ, వారిలో దాదాపు 10 మంది 2024లోనే కాంగ్రెస్‌కు మద్దతు పలికారు. బీజేపీకి 8 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ సంఖ్యాబలం దృష్ట్యా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు లాంఛనప్రాయమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## గోదావరి పుష్కరాల కోసం తెలంగాణ కేబినెట్ సబ్ కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పి.సుదర్శన్ రెడ్డిలను నియమించారు. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అవసరాన్ని బట్టి గోదావరి తీర ప్రాంతాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ప్రత్యేక ఆహ్వానితులుగా సమావేశాలకు పిలవనున్నారు. త్వరలోనే కమిటీ సమావేశమై సిఫార్సులను అందజేయనుంది.
2027 జూలై 23న గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈసారి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ కోరాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో సుమారు 560 కిలోమీటర్ల మేర గోదావరి ప్రవహిస్తుండటంతో దాదాపు 74 ఘాట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ముఖ్యంగా బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం ఆలయాల వద్ద రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో అక్కడ ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు.
పుష్కరాల ఏర్పాట్లు తాత్కాలికంగా కాకుండా, శాశ్వత ప్రాతిపదికన ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఆలయాల అభివృద్ధి, పర్మనెంట్ పుష్కర ఘాట్లు, రోడ్లు, వసతి సముదాయాలు నిర్మించాలని ఆదేశించారు. రోజుకు రెండు లక్షల మంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా ట్రాఫిక్, పార్కింగ్, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# మూసీ పేరుతో కాంగ్రెస్ దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

. బీఆర్ఎస్ పాలనలో వికాసం, కాంగ్రెస్ పాలనలో విధ్వంసం కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఇటుకను పేర్చనోడికి కూల్చే హక్కులేదని మండిపడ్డారు. నాగోల్ మూసీ పరీవాహక ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సుందరీకరణ పనులను గురువారం బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాడు మూసీలోని మురుగు నీరుని శుద్ధి చేయాలని బీఆర్ఎస్ ముందుకెళ్లింది. దేశంలోనే అతిపెద్దది అయిన నాగోల్ ఎస్టీపీని రూ. 4వేలకోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇండ్లు కూల్చకుండా, భూములు కోల్పోకుండా మూసీని అభివృద్ధి చేశామన్నారు. 2023 డిసెంబర్ వరకు 85 శాతం ఎస్టీపీ నిర్మాణం పూర్తయింది. 15 బ్రిడ్జీలు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. మిగతా పెండింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బంగారుపల్లెంలో పెట్టి కేసీఆర్ తెలంగాణను అప్పగించారు. కాంగ్రెస్ స్వార్థం కోసం రూ. 16 వేల కోట్ల అయ్యే ప్రాజెక్ట్ వ్యయం పది రెట్లు పెంచి 1.50లక్షల కోట్ల భారీ స్కాంకు తెరతీశారని



ఆరోపించారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకం సృష్టిస్తున్నది. రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉంది అది కూలగొట్టే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ప్రజలను రోడ్డున పడేసి ఏం సాధిస్తారన్నారు. సీఎం రేవంత్, మంత్రులు ఇలా అందరి ఇళ్లు బఫర్ జోన్‌లో ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో దివ్యాంగులు ఇళ్లు కూల్చారు. ఖమ్మంలో పేదల గుడిసెలను బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. ఇవన్నీ రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను బయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌కు రూ.16 వేల కోట్లతో మూసీని సుందరీకరించడం చేతకాకపోతే మేము చేసి చూపిస్తామని సవాల్ విసిరారు. రాష్ట్రంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు హద్దే లేదని కేటీఆర్ విమర్శించారు. పేదల ఇళ్లు కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేస్తామని సీఎం రేవంత్ చెబుతున్నారు. రూ.16వేల కోట్లతోనే ఆ పనులను చేయొచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించింది హామీల అమలు కోసమేనని గుర్తు చేశారు. రెండున్నరేళ్లలో ఒక్క ఇల్లు నిర్మించినట్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా. మూసీ సుందరీకరణ పనుల బాధ్యత మాకు అప్పగిస్తే రూ.16వేల కోట్లకే చేసి చూపిస్తాం. ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తాం అని కేటీఆర్ అన్నారు. కెటిఆర్ వెంట మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు ఉన్నారు.

## కుటుంబ నియంత్రణ నుంచి జనాభా పెరుగదల లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

వాటిల్లే అవకాశం ఉందని చెప్పారు. ఏపీ శాసనసభలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఏపీకి అత్యంత కీలకమైన పాలసీని శాసనసభలో ప్రకటించారు. ఇప్పటి వరకు ఫ్యామిలీ ప్లానింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చామని.. ఇకపై పాపులేషన్ కేర్ వైపు దృష్టి సారించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం డ్రాఫ్ట్ పాలసీని శాసనసభలో ప్రవేశపెట్టి ప్రజల ముందు ఉంచుతున్నామని వివరించారు. దీనిపై నెలరోజుల పాటు విస్తృత చర్చ జరగాలని కోరుతున్నామని సీఎం తెలిపారు. 2023 లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదవుతున్నాయని తెలిపారు. ఇలాగే కొనసాగితే 2047 నాటికి జనాభాలో 23 శాతం మంది వృద్ధులు ఉంటారని అన్నారు. మహిళల లేబర్ ఫోర్సు పార్టిసిపేషన్ రేట్ ప్రస్తుతం 31 శాతంగానే ఉంటుందని.. ఇది 59 శాతానికి చేరితే రాష్ట్ర జీఎస్‌డీపీ 15 శాతం పెరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. పాపులేషన్ మేనేజ్‌మెంట్ కోసం ఐదు అంచెల లైఫ్ సైకిల్ విధానాన్ని అమలు చేయాల్సి ఉందన్నారు. మాతృత్వం, శక్తి, క్షేమం, నైపుణ్యం, సంజీవని లాంటివి ఐదు పిల్లర్లుగా పనిచేస్తాయన్నారు. మహిళల గర్భధారణ నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి దశలో ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. పిల్లలు లేక ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడేవారిని ప్రభుత్వం ఆదుకుంటుందని.. మాతృత్వ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేసి, సబ్సిడీపై పీపీపీ మోడల్‌లో ఐవీఎఫ్(ఎ÷ఎఈ) సేవలు అందించాలని యోచిస్తున్నామని అన్నారు. సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించడం ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ప్రస్తుతం 8.8 శాతంగా ఉన్న టీనేజి గర్భధారణలను 3 శాతం కంటే తక్కువకు తగ్గించే చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. 10 మంది చిన్నారులు ఉన్న చోట చైల్డ్ కేర్ సెంటర్లు, పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు సీఎం తెలిపారు. మహిళల రక్షణ కోసం షీ క్యాబ్స్ అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నామన్నారు. విశాఖపట్నంలో రూ.172 కోట్లతో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. మహిళా ఉద్యోగులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాల్లో కొత్త వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. మూడో సంతానం, ఆపై జననాలకు తల్లులకు 12 నెలల పేరెంటల్ లీవ్, తండ్రులకు 2 నెలల పెటర్నల్ లీవ్ ఇవ్వాలని ఆలోచిస్తున్నామని అన్నారు. త్వరలో 'తల్లిదండ్రుల సమాన బాధ్యత' పేరుతో కుటుంబ బాధ్యతలు పంచుకోవడంపై అవగాహన క్యాంపెయిన్ నిర్వహిస్తామని సీఎం తెలిపారు. 2047 నాటికి ఏపీలో వృద్ధుల జనాభా 23 శాతం ఉంటుందని అంచనా వేస్తూ, ప్రతి జిల్లాలో వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు సీఎం. 175 సీహెచ్‌సీలలో రెండు వారాలకు ఒకసారి ప్రత్యేక క్లినిక్ నిర్వహిస్తామని తెలిపారు.

## ఈ ఏడాది స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో మెరుగైన ఫలితాలు సాధించాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 05:–**స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే లో గత ఏడాది వచ్చిన ర్యాంక్ కంటే ఈసారి మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ లో స్వచ్ఛ సర్వేక్షణ్ మార్గదర్శకాల అమలు, కార్యక్రమాల నిర్వహణపై మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ లో నిర్దేశించిన 10 ఇండికేటర్ లలో భాగంగా విజిబుల్ క్లీన్లినెస్, శానిటేషన్,సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్, పారిశుధ్య సౌకర్యాలు, వాటర్ మేనేజ్మెంట్, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలను వంద శాతం సాధించాలని ప కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు. పట్టణాలు, కర్నూలు నగరం లో శానిటేషన్ ను మరింత మెరుగుపరుచాలన్నారు. ప్రతి దుకాణం వద్ద తడి మరియు పొడి చెత్త కోసం రెండు వేర్వేరు డబ్బాలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ వంద శాతం జరిగేలా చూడాలన్నారు. ఫుట్‌పాత్ మరమ్మతులు, పట్టణ సుందరీకరణ పనులలో పురోగతి తీసుకొని రావాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు.సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగి రెడ్డి, ఆదోని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్,గూడూరు మున్సిపల్ కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోకదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడండి






**ఆదోని మన జనప్రగతి మార్చి 05:–**ఈనెల 14వ తేదీలో నిర్వహించే లోకదాలత్ లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా ప్రత్యేక ఫోక్సో కోర్టు జడ్జి రాజేంద్ర బాబు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీల వెంకట శేషాద్రి అన్నారు. గురువారం కర్నూలు జిల్లా ఆదోనిలో ఈనెల 14న నిర్వహించే జాతీయ లోకదాలత్ సందర్భంగా పోలీసు అధికారులు, న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాజీ కాబడే, పరిష్కార దశలో ఉండే,బ్యాంకులకు సంబంధించిన కేసులను ఈ లోకదాలత్ ద్వారా పరిష్కరించేందుకు మంచి మార్గం అన్నారు. అనంతరం ఆదోని సబ్ జైలును తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి యజ్ఞ నారాయణ, ప్యానల్ లాయర్ ఆనంద్,చంద్రయ్య, డాక్టర్ విష్ణు జైలు సూపర్డెంట్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.డి.ఓకు బిజెపి నాయకులు వినతి పత్రం అందజేత





**పత్తికొండ మన జన ప్రగతి మార్చి 05:–** పత్తికొండ ఆర్డిఓ కొండయ్యకు హోసూరు నుండి మొలగవల్లి కొట్టాల రోడ్డు ధ్వంసం అయిన సంఘటనపై బిజెపి నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో ఇక్కడి ప్రాంత రైతులను గ్రామాల ప్రజలను దృష్టిలో ఉంచుకొనిపత్తికొండ మండలం హోసూరు గ్రామం నుండి ఆలూరు తాలూకా హరిజన కొట్టాల,మొలగవల్లి,కురువ కొట్టాల, ఈ గ్రామాల ప్రజలు రైతులు, పాద చారులు,వాహనదారు ఇబ్బందులు చూసి ప్రభుత్వం, ఆర్ =&దీ అధికారులు 7:50 కోట్ల రూపాయలతో ఇంటర్నల్ తారు రోడ్డు మంజూరు చేసి రోడ్డు వేయడం జరిగినది.ఈ రోడ్డు పూర్తిగా నల్ల రేగడిలో వేసిన రోడ్డు.ఈ రోడ్డుపై గాలి మరల వాహనాలు,అతి భారీ కంకర,ఇసుక,లారీలు అర్ధరాత్రి పూట తిరగడం వలన రోడ్డు పూర్తిగా ధ్వంసం అవుతున్నది.ధ్వంసం అయిన రోడ్డును గాలి మరల కాంట్రాక్టర్ను , విద్యుత్ లైన్ కాంట్రాక్టర్లను, ద్వారా మీరు రోడ్డు వేయించగలరని కోరుచున్నాము.ఈ రోడ్ వర్షాకాలం పూర్తిగ ధ్వంసం అయి విధంగా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తున్నారు.కాబట్టి పై అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ నాయకులు, గ్రామాల ప్రజలు కోరారు.ఈ ఇంటర్నల్ రోడ్డు ప్రజలకు అనుకూలమైనది.అధికారులు స్పందించకపోతే హోసూరు,మొలగ వెల్లి,హరిజన కొట్టాల, కురువ కొట్టాల, గ్రామల ప్రజలు ఆ భారీ వాహనాలను అడ్డుకుంటామని కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కో కన్వీనర్ గోవర్ధన్ నాయుడు, బ్రహ్మయ్య స్టేట్ కౌన్సిల్ మెంబర్ పూనా మల్లికార్జున, మాజీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ దండి మల్లికార్జున, కిషన్ మోర్చా మాజీ జిల్లా కార్యదర్శి కే సురేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీధర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి వీరేష్, రామాంజనేయులు, తదితరులు ఆర్డిఓ గారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

## ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు

### ప్రజలకు హాని కలిగించే రసాయనాలు వాడవద్దు

### ఆదోనిలో పలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై ఆకస్మిక దాడులు







**ఆదోని మన జనప్రగతి మార్చి 05:–** ప్రజలకు హాని కలిగించే రసాయనాలు వినియోగించి తయారుచేసిన వస్తువులు,ఆహారం తిని ప్రజలు ప్రాణాల మీదకు తెచ్చుకో రాదని జిల్లా ఆహార భద్రత శాఖ అధికారి రాజగోపాల్ రావు అన్నారు. గత మూడు రోజులుగా ఆయన ఆదోని పట్టణంలోని పలు చికెన్ పకోడా,గోబీ మంచూరి దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.వాటిని అమ్మే వారికి హెచ్చరికలు జారీ చేశారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో గోబీ మంచూరి, మరియు ఇతర ఆహారం తినేవారికి పలు సూచనలు చేశారు.ప్రభుత్వం నిషేధించిన వస్తువులు,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో వాడితే దుకాణాలు సీజ్ చేస్తాం అని హెచ్చరించారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ప్రజలకు హాని కలిగించే అజంతా కలర్ పౌడర్,మరియు టేస్టింగ్ సాల్ట్ చైనా ఉప్పు ఉపయోగించి వారి ఆరోగ్యాలతో వ్యాపారులు ఆడుకుంటున్నారని అన్నారు. ప్రజలు ఎటువంటి ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో తాత్కాలికంగా రుచి అందించే ఆహారం తినరాదని,ప్రజలకు సూచించారు. తమ వ్యాపారం కోసం ప్రజల ఆరోగ్యాన్ని నష్టం కలిగించే టెస్టింగ్ సాల్ట్ మరియు అజంతా కలర్ పౌడర్ ఉపయోగిస్తున్నారని, దీనివల్ల క్యాన్సర్ వ్యాధి సోకుతుందని రాజగోపాలరావు తెలిపారు. ఆదోని పట్టణంలోని మోర్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఉన్న హనుమాన్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ను ఆదోని డివిజన్ వినియోగదారుల రక్షణ మండలి అధ్యక్షుడు ఈసా భాష తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి సదరు సెంటర్ యజమానిని ఆహార భద్రత పై హెచ్చరికలు జారీ చేశారు. గోబీ మంచూరి, మరియు అజంతా పౌడర్ టెస్టింగ్ సాల్ట్ లను ధ్వంసం చేశారు.మరోసారి ఇటువంటి హాని కలిగించే పౌడర్లు టెస్టింగ్ సాల్ట్ ఉపయోగిస్తే షాప్‌ను సీజ్ చేయడం జరుగుతుందని షాప్ యజమానికి తీవ్రంగా హెచ్చరించారు. ఎలాంటి హానికరమైన వస్తువులు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకులు ఉపయోగిస్తే వారిపై కేసులు నమోదు చేయడం కాక అవసరమైతే ప్రజా ఆరోగ్యం కోసం సెంటర్లను సీజ్ చేయడం జరుగుతుందని జిల్లా ఆహార భద్రత శాఖ అధికారి రాజగోపాల్ రావు హెచ్చరించారు.

## మార్చి 16 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ

### పరీక్షా కేంద్రాలలో త్రాగునీరు,లైటింగ్ వంటి వసతులన్నీ సక్రమంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 05:–** ఈ నెల 16 నుండి ఏప్రిల్ 1 వ తేదీ వరకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ లో ఎలాంటి పొరపాట్లు జరగకూడదని,ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా జరగకుండా పకడ్బందీగా పరీక్షలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని,విద్యార్థులు ఉదయం 9 గంటలకే సెంటర్లు చేరుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఇన్విజిలేటర్లు, విద్యార్థులు ఎవరూ పరీక్షా కేంద్రం లోపలికి ఫోన్లు తీసుకురాకూడదన్నారు.ఎగ్జామినేషన్ సెంటర్ లలో పాత సామాన్లు లేకుండా గదులను శుభ్రంగా ఉంచాలని,విశాలంగా,మంచి గాలి,వెలుతురు ఉండేలా చూసుకోవాలన్నారు. పిల్లలు కింద కూర్చుని పరీక్షలు రాసే పరిస్థితి ఉండకూడదని,అన్ని సెంటర్ లలో బెంచీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ డిఇఓ ను ఆదేశించారు.కింద కూర్చుని పరీక్షలు రాసే పరిస్థితి ఉండకూడదని,విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదని కలెక్టర్ ఆదేశించారు.గదుల బయట హాల్ టికెట్ నంబర్లు స్పష్టంగా, పెద్ద అక్షరాలతో కనిపించేలా ప్రింట్ తీసి అతికించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.ఫ్లయింగ్ స్క్వాడ్స్ మరియు సిట్టింగ్ స్క్వాడ్స్ తనిఖీల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు.నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయాలు ఉండాలన్నారు.ప్రతి పరీక్షా కేంద్రం దగ్గర 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వంద మీటర్ల పరిధిలో ఉన్న జిరాక్స్ షాప్ సెంటర్లు మూయించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. 34 పోలీస్ స్టేషన్ లను స్టోరేజ్ పాయింట్ లుగా గుర్తించడం జరిగిందని, పరీక్ష సమయం పూర్తి కాగానే ఆన్సర్ షీట్ లు పోస్టాఫీస్ కి చేరే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.డిఈఓ సుధాకర్ మాట్లాడుతూ 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో రెగ్యులర్ కింద 33,796, ప్రైవేట్ కింద 1975 విద్యార్థులు మొత్తం 35,771 మంది హాజరు కానున్నారన్నారు. 160 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 8 కేంద్రాలను సమస్యాత్మక పరీక్ష కేంద్రాలుగా గుర్తించడం జరిగిందని కలెక్టర్ కు వివరించారు.సమావేశంలో డి ఎమ్ హెచ్ ఓ డా.భాస్కర్ రాజు, డి పి ఓ భాస్కర్, డిటిసి శాంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరుల ఆత్మీయ ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

**పులివెందుల అర్బన్ మదిన ప్రగతి మార్చి 05:–** పులివెందుల పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న మహమ్మదీయ మసీదులో ఓతూరు రసూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఓతురు రసూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు మసీదుకు చేరుకున్న ఎంపీ అవినాష్ రెడ్డిని నిర్వాహకులు సాదరంగా ఆహ్వానించి,శాలువాలతో ఘనంగా సత్కరించారు.రంజాన్ పవిత్రతను చాటిచెప్పేలా నిర్వహించిన ఈ ఇఫ్తార్ విందులో ఎంపీ ముస్లిం సోదరులతో కలిసి ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం క్రమశిక్షణకు, దాతృత్వానికి మరియు సోదరభావానికి ప్రతీకని,కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి ఉండాలన్నదే మన ప్రియతమ నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆకాంక్ష అని అన్నారు.పవిత్రమైన రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపట్టడం ద్వారా భక్తిభావం పెంపొందుతుందని ముస్లిం సోదరులందరికీ అల్లాహ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని పులివెందుల నియోజకవర్గంలో మసీదుల అభివృద్ధికి మరియు ముస్లిం సోదరుల అవసరాలకు మేము ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు.పులివెందుల మున్సిపల్ వైస్ ఛైర్మన్ వైఎస్ మనోహర్ రెడ్డి,మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫిజ్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, నూరుల్లా,కార్పెంటర్ బాబా,షబ్బీర్,మహమ్మద్ భాష,హమీద్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ





నాయకులు,కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం పెద్దలు పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన జడ్పీటీసి బైయపు రెడ్డి

● నవదంపతులకు నిండు నూరేళ్లు సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్ష. ● గండి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేంద్రబాబు నివాసంలో ఆత్మీయ సమావేశం. ● కుటుంబ సభ్యులతో ముచ్చటించి శుభాకాంక్షలు తెలిపిన వేముల మండల జడ్పీటిసి.

**వేముల మన జనప్రగతి మార్చి 05:–** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల(గండి క్షేత్రం) ప్రిన్సిపాల్ సురేంద్రబాబు ఆహ్వానం మేరకు వేముల మండల జడ్పిటిసి కోకటం వెంకట బైయపు రెడ్డి గురువారం సాయంత్రం ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు.ఇటీవల జరిగిన వివాహ వేడుక సందర్భంగా సురేంద్రబాబు కుమార్తె లీలా మునీశ్వరి, అల్లుడు వంశీలను కలిసి వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జడ్పిటిసి కోకటం వెంకట బైయపు రెడ్డి మాట్లాడుతూ నవదంపతులు నిండు నూరేళు సుఖసంతోషాలతో, ఐశ్వర్యంతో జీవించాలని ఆశీర్వదించారు. కొత్త జీవితంలో పరస్పర అవగాహనతో ముందుకు సాగుతూ కుటుంబానికి, సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.జడ్పిటిసి కోకటం వెంకట బైయపు రెడ్డి రాకతో ప్రిన్సిపాల్ సురేంద్రబాబు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఆయనకు సాదర స్వాగతం పలికి మర్యాదపూర్వకంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు,సన్నిహితులు పాల్గొని నవదంపతులకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
06 -03-2026

## ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి వారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



**ఒంటిమిట్ట మన జనప్రగతి మార్చి 05:**-ఒంటి మిట్ట బ్రహ్మోత్సవాల నిర్వహణ పై గురువారం సాయంత్రం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయమునకు చేరుకున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి,టిటిడి జె ఈ ఓ వీర బ్రహ్మం లకు మేళ తాళాలతో స్వాగతం శ్రీ కోదండ రామస్వామి వారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ భావన స్వామివారి దర్శనానంతరం వేద పండితుల ఆశీర్వాదంతో తీర్థ ప్రసాదాలను స్వీకరించిన జిల్లా కలెక్టర్, జెసి, రాజంపేట సబ్ కలెక్టర్

## కేఓఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో వ్యక్తిత్వ వికాస కార్యక్రమం.




**కడప మన జనప్రగతి మార్చి 05:-** కడప నగర పరిధిలోని కందుల ఓబులరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈరోజు మనోవిజ్ఞాన నిపుణుడు మరియు ప్రేరణాత్మక ప్రసంగకర్త శ్రీ అభిషేక్ సింగంసెట్టి ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాస కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం,ఆత్మవిశ్వాసం మరియు సానుకూల ఆలోచనల ప్రాముఖ్యత గురించి వివరించారు.అలాగే విద్యార్థులు తమ సంభాషణ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం, బలమైన మనస్తత్వాన్ని అభివృద్ధి చేసుకోవడం మరియు వ్యక్తిగత-వృత్తి పరమైన అభివృద్ధిపై దృష్టి పెట్టడం గురించి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమాన్ని కె.సి. పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా ఉన్న శ్రీ ఓ. బ్రహ్మయ్య సహకారంతో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. సిద్ధేశ్వర రావు మాట్లాడుతూ, విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కళాశాల వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## అక్కసానిపల్లిలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పర్యటన

### - గృహప్రవేశ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 05:** కడప జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి గురువారం పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు.తలుపుల మండలం,ఉడమలకుర్తి పంచాయతీ పరిధిలోని అక్కసానిపల్లి గ్రామానికి చెందిన బిల్డర్ వెంకటేశ్వర్లు నూతన గృహప్రవేశ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి ఇంటి యజమానులకు మరియు కుటుంబ సభ్యులకు అభినందనలు తెలుపుతూ, నూతన గృహంలో వారు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.వేడుకకు విచ్చేసిన నాయకులు, కార్యకర్తలను ఆయన పేరుపేరునా పలకరిస్తూ కాసేపు వారితో ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.



## 100% పురోగతి సాధిస్తేనే లక్ష్యాన్ని ఛేధించగలం: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

- కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్ల పురోగతిపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష



**కడప టౌన్ మన జనప్రగతి మార్చి 05:-** జిల్లాలోని అన్ని శాఖలలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ, ప్రజాసేవా కార్యక్రమాలలో 100% పురోగతి సాధిస్తేనే.. స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యాన్ని సాధించగలమని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.గురువారం కలెక్టరేట్ లోని తానా ఛాంబర్ లో... కీ పర్ఫార్మెన్స్ ఇండిక్టేటర్ల పురోగతిపై అన్ని శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ డి. శ్రీధర్ చెరుకూరి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, వివిధ ప్రాజెక్టులకు సంబంధించి ఆయా శాఖల పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలు, ప్రజా సేవలు మొదలైన అంశాలలోకీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్ల పురోగతిలో 100% సఫలత సాధిస్తేనే.. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. అన్ని శాఖల వారికి కేటాయించిన లక్ష్యం మేరకు ఆయా ప్రమాణికాల్లో పురోగతిని బేరీజు వేసుకుని ఏ, బి, సి, డి కేటగిరీలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. కెపిఐ పురోగతిలో వెనుకబడిన శాఖల అధికారులపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడంలో అలసత్వం వహిస్తే సహించలేదన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధికారులు, సిబ్బంది సమన్వయంతో అన్ని శాఖల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో వైఎస్ఆర్ జిల్లా నిర్దేశిత లక్ష్యాలను 100% పూర్తి చేసేలా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వ, రాష్ట్ర పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం, ప్రజల సామాజిక-ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడమే లక్ష్యంగా వినూత్న వ్యూహాలతో చురుకైన పాలన సాగించడం వల్ల మాత్రమే ఆకాంక్షిత జిల్లా లక్ష్య సాధనను సాధించగలమన్నాను. ఈ సమావేశంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలి: డాక్టర్ వేమల సలీం బాషా




**కడప మన జనప్రగతి మార్చి 05:-** మహిళలు విద్యా రంగంతో పాటు సమాజంలోని అన్ని రంగాల్లోనూ ముందుండాలని ఎస్‌కేఆర్ & ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేమల సలీం బాషా పేర్కొన్నారు. కడప నగరంలోని ఎస్‌కేఆర్ & ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వృక్షశాస్త్ర విభాగం,ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ మరియు పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు సామాజిక అంశాలపై అవగాహన సదస్సు, వివిధ పోటీలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్ వేమల సలీం బాషా మాట్లాడుతూ విద్యార్థినులు కేవలం విద్యలోనే కాకుండా సామాజిక చైతన్యంలోనూ అగ్రగాములుగా ఉండాలని సూచించారు.ఆత్మవిశ్వాసంతో తమ హక్కుల కోసం నిలబడినప్పుడే సమాజంలో మహిళలకు గౌరవం లభిస్తుందని తెలిపారు.“మహిళల రక్షణ మరియు సమాజంలో వారి పాత్ర” అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో కె. దీపిక ప్రథమ బహుమతి,ఎన్. ప్రేమ ద్వితీయ బహుమతి సాధించారు.పెయింటింగ్ పోటీలో జి. రోజా ప్రథమ, వి. శ్రీలక్ష్మి ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు. వక్తృత్వ పోటీలో వి. ప్రహర్షిత ప్రథమ బహుమతి అందుకున్నారు.ఈ సందర్భంగా మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్. నజరీన్ మాట్లాడుతూ మహిళలు ఆపద సమయంలో 100, 112, 1091,181 వంటి ఉచిత హెల్ప్‌లైన్ నంబర్లతో పాటు ‘దిశ’ యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఉమెన్ కోఆర్డినేటర్ వై. నాగరత్నమ్మ మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం ప్రాముఖ్యతను వివరించగా,వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం ప్రకృతిలో మహిళల పాత్రను వివరించారు.పోటీలలో విజేతలకు మార్చి 8న నిర్వహించే మహిళా దినోత్సవ వేడుకల్లో జిల్లా ఎస్పీ చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో సి.వి.శివశంకర్ రెడ్డి, కానిస్టేబుల్ బి. రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.అధిక సంఖ్యలో విద్యార్థినులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రిన్సిపల్ విజేతలను ప్రత్యేకంగా అభినందించారు

## మహిళా భద్రతే పోలీసుల కర్తవ్యం: సిఐ టి.నరసింహులు

- ఘనంగా మహిళా సాధికారత వారోత్సవాలు
- మహిళల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ




**వేంపల్లె మన జనప్రగతి మార్చి 05:-** మహిళల బద్రతే పోలీసుల కర్తవ్యమని వేంపల్లె సీఐ టి.నరసింహులు అన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ విధ్యార్థినిలతో మహిళల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలిస్ శాఖ చేపట్టిన మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా స్థానిక నాల్గు రోడ్ల కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం మానవహారం ఏర్పడి మహిళల బద్రత, రక్షణ, ప్రాముఖ్యత తదితర అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మహిళలు ఆత్మస్తైర్యంతో అడుగు ముందుకేయాలని, సమాజంలోని అవకాశాలను అందుకుని ఆదర్శవంతంగా నిలవాలన్నారు. ఆపద సమయంలో ఉన్న మహిళలు భయం వీడి డయల్ 112, శక్తి యాప్ ద్వారా పోలీస్ రక్షణ పొందవచ్చున్నారు. మహిళలు, బాలికల బద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. అలాగే బాల్య వివాహాలు, మాదకద్రవ్య నిర్మూలన, సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్త, ఈవ్ టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరినప్పుడే మహిళా సాధికారత సాధ్యమని, దీనికి పోలీస్ శాఖ ఎల్లవేళలా ముందుంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్, జడ్పీ హెచ్ఎం నాగాంజనేయులు, పీజీటీ చెరుకూరు శ్రీనివాసులు, ఎస్సై తిరుపాల్ నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాలకు అండగా నిలవండి

- పి 4 జాబ్ మేళాకు విశేష స్పందన: కమిషనర్ ఎన్.మౌర్య




**తిరుపతి మన జనప్రగతి మార్చి 05:-** బంగారు కుటుంబాలకు మార్గదర్శులు అండగా నిలవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. గురువారం జీవకోనలోని విశ్వం స్కూల్ నందు నగరపాలక సంస్థ, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాను కమిషనర్ ఎన్.మౌర్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని బంగారు కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మార్చేందుకు మార్గదర్శులు ముందుకు వచ్చి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగానే ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సహకారంతో జాబ్ మేళా నిర్వహించామని తెలిపారు. ఈ మేళా కు సుమారు 300మంది హాజరు కాగా అందులో 200 మంది బంగారు కుటుంబాల వారు ఉన్నారని తెలిపారు. 18 నుండి 35 సంవత్సరాల లోపు ఉన్న వారికి పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించానున్నారని తెలిపారు. మంచి కంపెనీ లు అర్హులైన వారికి యాజమాన్యాలు అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. మూడు రోజుల పాటి ఈ జాబ్ మేళా జరుగుతుందని తెలిపారు. అర్హులైన వారు ఈ జాబ్ మేళా లో పాల్గొని ఉద్యోగాలు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ శారదా దేవి, ప్రయివేట్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు విశ్వనాథ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, రెవిన్యూ అధికారి రవి, సచివాలయం కార్యదర్సులు, తదితరులు పాల్గొన్నారు.

## హిందూ-ముస్లిం సోదరభావానికి నిదర్శనం..

- గండబోయనపల్లిలో ఇఫ్తార్ విందు.



**వాల్మీకిపురం మన జనప్రగతి మార్చి 05:-** పీలేరు నియోజకవర్గం వాల్మీకిపురం మండలం గండబోయనపల్లి గ్రామంలో మతసామరస్యానికి ప్రతీకగా గురువారం రంజాన్ ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మజీద్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లింలు, ఇతర మతాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పరస్పర మైత్రిని చాటుకున్నారు.గండబోయనపల్లి గ్రామానికి చెందిన కలికిరి ధరణి హోటల్ యజమాని, శ్రీ సత్యమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ మరియు రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులి సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రంజాన్ మాసంలో నెల రోజుల పాటు ఉపవాసం పాటించే ముస్లిం సోదరులకు సత్కారం చేయాలనే సంకల్పంతో ఈ విందును నిర్వహించినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమానికి వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏ.ఎం.సీ) మాజీ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని మతసామరస్యాన్ని ప్రోత్సహించారు.ఈ సందర్భంగా కంభం నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో వివిధ మతాలు,సంస్కృతులు ఉన్నప్పటికీ అందరూ సోదరభావంతో కలిసి జీవించడం భారతదేశం గొప్ప సంప్రదాయం అని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను మరింత బలపరుస్తాయని అన్నారు.ప్రతి మతాన్ని గౌరవిస్తూ పరస్పర ప్రేమాభిమానాలతో జీవించడం ద్వారా సమాజం మరింత శాంతి, సౌహార్దంతో ముందుకు సాగుతుందని తెలిపారు.పులి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం పవిత్రమైనది అని,ఈ నెలలో ముస్లిం సోదరులు ఉపవాసం ఉండి ప్రార్థనలు చేయడం గొప్ప ఆధ్యాత్మిక సాధన అని అన్నారు.ఉపవాసం ముగిసిన సందర్భంగా వారికి ఆత్మీయంగా ఇఫ్తార్ విందు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. గ్రామంలో అన్ని మతాల ప్రజలు కలిసి ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం మతసామరస్యానికి నిదర్శనమని చెప్పారు.ఇఫ్తార్ విందు సందర్భంగా గ్రామంలో ఆనందోత్సాహాలు నెలకొని మతసామరస్య వాతావరణం స్పష్టంగా కనిపించింది. గ్రామస్తులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ సామరస్యంతో ఈ కార్యక్రమాన్ని జరుపుకోవడం విశేషం.ఈ కార్యక్రమంలో అమర్నాథ్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,గంగిరెడ్డి, పెదబాబు,శ్రీకాంత్ రెడ్డి, దొరబాబు రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అలాగే గ్రామానికి చెందిన ముస్లిం యువకులు మరియు పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఈ-బైక్ షోరూంను ప్రారంభించిన సుగవాసి,ముక్కా.



**చిట్వేలి మన జన ప్రగతి మార్చి 05:**-పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెరగాల్సిన అవసరం ఉందని రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు అన్నారు. గురువారం చిట్వేలి పట్టణంలో శ్రీ సద్గురు ఎంటర్ప్రైజెస్ ఎకో మోటివ్ మోటార్స్ ఈ-బైక్స్ గ్రాండ్ షోరూంను రైల్వే కోడూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బాధ్యులు ముక్కా రూపానంద రెడ్డితో కలిసి ప్రారంభించారు.షోరూం నిర్వాహకులు గోపిదేశి ప్రసాద్, భాను ప్రకాష్, పిడుగు ప్రసాద్‌ల ఆహ్వానం మేరకు షోరూం నందు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం రిబ్బను కత్తిరించి షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ పెట్రోల్ ధరలు పెరుగుతున్న తరుణంలో సామాన్యులకు ఈ - బైక్స్ ఎంతో ఊరటనిస్తాయని, పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. ఇటువంటి వ్యాపార సంస్థల ద్వారా యువతకు ఉపాధి లభించడం సంతోషకరం అన్నారు.ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ అధునాతన ఫీచర్లతో కూడిన ఈ - బైక్స్ చిట్వేలి ప్రజలకు అందుబాటులోకి రావడం శుభపరిణామం అని, నిర్వాహకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏఐఎంఐఎం పార్టీని ఆదరించండి



**ఆదోని మన జనప్రగతి మార్చి 05:**-రానున్న రోజుల్లో ఆదోని ప్రజలు పార్టీని ఆదరించి ఎన్నికల్లో పోటీ చేస్తే గెలిపించాలని ఆ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ జునైద్ అన్నారు. గురువారం కర్నూలు జిల్లా ఆదోని కౌడాలపేటలో సాయంత్రం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహమ్మద్ జునైద్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఆదోని ప్రజలు ఏఐఎంఐఎం పార్టీకి పూర్తిస్థాయి మద్దతు ఇచ్చి తమ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం కాలనీ ఇంచార్జ్ అయిన డాక్టర్ మహబూబ్ సాహెబ్ కు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎంఐఎం నాయకులు సద్దాం హుస్సేన్,నాసిర్ హుస్సేన్, అహమ్మద్ హుస్సేన్, ఖాసిం, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ రంగంలో రాణిస్తున్న మహిళలు

**పులివెందులలో తొలి మహిళా ఎక్స్‌కవేటర్ ఆపరేటర్లకు సత్కారం**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 05:** మహిళా దినోత్సవం సందర్భంగా పులివెందుల నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ లో శిక్షణ పొందుతున్న రాష్ట్రంలోనే మొదటి మహిళా ఎక్స్‌కవేటర్ ఆపరేటర్లకు ఘనంగా సత్కారం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇక్కడ 20 మందికి 'జూనియర్ ఎక్స్‌కవేటర్ ఆపరేటర్' శిక్షణ అందిస్తున్నారు.ఇందులో భాగంగా ప్రముఖ 'శాని' సంస్థ ప్రతినిధులు శిక్షణ పొందుతున్న మహిళలను అభినందించారు.మధుర ఇంజనీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ సాధారణంగా పురుషులకే పరిమితమైన నిర్మాణ మరియు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో నేడు మహిళలకు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.మహిళలు పట్టుదలతో ఈ రంగంలో రాణించాలని ఆయన ఆకాంక్షించారు.కుందన్‌శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన మహిళా ఆపరేటర్లకు తమ 'శాని' కంపెనీలో నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ సంస్థ ప్రతినిధి కుందన్ ప్రకటించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు.నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ రాకేష్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు అన్ని రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుతున్నారని,భారీ యంత్రాల నిర్వహణలోనూ మహిళలు భాగస్వాములు కావడం గర్వకారణమని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాక్ సెంటర్ ఇంచార్జీ చెన్నకేశవులు,దేవేంద్ర మలి, ప్రేమ్ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు గోవిందవాడ విద్యార్థుల ఎంపిక

**• అభినందించిన ప్రధానోపాధ్యాయుడు,గ్రామ పెద్దలు**



**బొమ్మనహల్ మన జనప్రగతి మార్చి 05:-** మండల పరిధిలోని గోవిందవాడ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ప్రతిభ కనబరిచారు,గత సంవత్సరం డిసెంబర్‌లో రాయదుర్గం నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన పరీక్షలో 8వ తరగతి విద్యార్థులు ఎస్. అల్తాఫ్ అలీ,పి. రమీజాబీ ఎంపికయ్యారు,ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాజసూరుడు మాట్లాడుతూ..ఆర్థికంగా వెనుకబడి ఇది ఒక సువర్ణ అవకాశంగా భావించి ఈ పరీక్షలలో భాగంగా ఉత్తీర్ణత సాధించి ప్రతిభావంతులైన విద్యార్థులకు 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదువు కొనసాగించేందుకు ప్రభుత్వం ఈ స్కాలర్‌షిప్ అందిస్తుందని తెలిపారు,అర్హత సాధించిన విద్యార్థులకు సంవత్సరానికి 12,000 రూపాయలు అంటే నెలకు 1,000 రూపాయలు చెప్పిన ఆర్థిక సహాయం అందుతుందని తెలియజేశారు,ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆ ఇద్దరు విద్యార్థులను గోవిందవాడ గ్రామ పెద్దలు ఉపాధ్యాయ సిబ్బంది తోటి విద్యార్థులు వారిని అభినందించారు.

# పులివెందుల మున్సిపాలిటీలో పన్నుల వసూళ్ల జోరు

**మార్చి 31లోగా 100 శాతం లక్ష్య సాధన దిశగా చర్యలు**

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 05:-** పులివెందుల పురపాలక సంఘం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించింది.ఈ ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3.85 కోట్ల రూపాయల ఇంటి పన్ను మరియు నీటి పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 3.26 కోట్ల రూపాయలను వసూలు చేసినట్లు మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ అధికారులు వెల్లడించారు.మార్చి 31వ తేదీతో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో మిగిలిన బకాయిలను వంద శాతం వసూలు చేసేందుకు మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.పన్ను వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు పట్టణంలోని 18 సచివాలయాల పరిధిలో అడ్మిన్ సెక్రటరీలు మరియు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో కూడిన ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నాయని ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు,మధ్యాహ్నం 4 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు ఇంటింటికీ వెళ్లి పన్ను బకాయిలు చెల్లించాల్సిందిగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.పట్టణ అభివృద్ధిలో పన్నుల పాత్ర కీలకమైనదని,ప్రతి వార్డులోనూ వంద శాతం పన్నులు వసూలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాంఅని ప్రజలు తమ బాధ్యతగా పన్ను బకాయిలను వెంటనే చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి అని కమిషనర్ పేర్కొన్నారు.ఈ వసూళ్ల ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి సచివాలయానికి ఒక ప్రత్యేక అధికారిని (స్పెషల్ ఆఫీసర్) నియమించినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమం లో సచివాలయ అడ్మిన్ లు మరియు ప్రతేకఅధికారులు పాల్గొన్నారు.



# నవధాన్యాలతో భూమికి పునర్జీవం

**• పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన**

**• దుర్గన్నగారిపల్లిలో రైతులకు 80 నవధాన్యాల కిట్లు సిద్ధం**

**• ఖర్చు తగ్గించి మంచి దిగుబడులు సాధ్యమని అధికారుల సూచన**




**వేముల మన జనప్రగతి మార్చి 05:-** వేముల మండల పరిధిలోని స్థానిక దుర్గన్నగారిపల్లి గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.వి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ...ప్రస్తుత రసాయన వ్యవసాయం కారణంగా భూమి సారాన్ని కోల్పోయి నిస్సారంగా మారుతున్నదని తెలిపారు.అందువల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులను రైతులు విస్తృతంగా అవలంబించాలని సూచించారు.రుతుపవనాల కంటే ముందుగా ఖాళీగా ఉన్న బీడు భూముల్లో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (నవధాన్యాలు) పద్ధతిలో పంటలు వేసుకోవాలని రైతులకు సూచించారు.విత్తిన నవధాన్యాలను సుమారు 65 రోజుల పూత దశలో పశువులకు మేతగా ఉపయోగించి,మిగిలిన అవశేషాలను భూమిలో కలిపితే భూమి సారవంతం పెరిగి ప్రధాన పంటలకు అవసరమైన సూక్ష్మ,స్థూల పోషకాలు అందుతాయని వివరించారు.దుర్గన్నగారిపల్లి గ్రామంలోని లక్ష్మీదేవి తిరుపాలరెడ్డి ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రంలో రైతుల కోసం 80 నవధాన్యాల కిట్లు తయారు చేసి అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.అవసరమైన రైతులు ఈ కిట్లను తీసుకుని వినియోగించుకోవాలని సూచించారు.మండల వ్యవసాయ అధికారి జి.ఓబులేసు మాట్లాడుతూ...ఇలాంటి ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించడం ద్వారా భూమికి అవసరమైన పోషకాలు అందడంతో పాటు రైతులు పెట్టుబడిని తగ్గించుకుని మంచి దిగుబడి సాధించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ సురేష్,ఎన్ఎఫ్ఏ శ్రీనాథ్ రెడ్డి,డివిజనల్ ఇంచార్జ్ భాస్కర్ రెడ్డి,యూనిట్ ఇంచార్జ్ కృష్ణయ్య,రామ్మోహన్ నాయుడు,వెంకటేష్,ఐ.సి.ఆర్.పి నరసింహులు ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్,గ్రామ పెద్దలు మరియు రైతులు పాల్గొన్నారు

# విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

**• ఓయూ బిజినెస్ మేనేజ్మెంట్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీరాములు**



**హైదరాబాద్ మన జనప్రగతి మార్చి 05:-** విద్యార్థులు పూర్తిగా అధ్యాపకులు, పాఠ్యపుస్తకాలపైన ఆధారపడకుండా సొంత పరిజ్ఞానంతో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం డీన్ ప్రొఫెసర్ డి. శ్రీరాములు అన్నారు. నారాయణగూడలోని జాగృతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురువారం 'బిజ్ స్పియర్ ఫెస్ట్-2026' పేరుతో నిర్వహించిన బిజినెస్ మీట్ ను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు రూపొందించి ప్రదర్శనలో ఉంచి ఎగ్జిబిట్స్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యను అభ్యసించాలని అన్నారు. విద్యార్థులు సృజనాత్మకతను ఉపయోగించి కొత్త పద్ధతులను కనుగొనాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జాగృతి విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఓ.శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ డి. జోసఫిన్ రెడ్డి, కార్యదర్శి ఎ. శశికిరణ్ రెడ్డి, ఎన్.నీతారెడి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


# శనగ రైతు కంట కన్నీరు..

**క్వింటాకు 8,000 చెల్లించాలని ఉరవకొండలో భారీ నిరసన**




**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 05:-** రబీ సీజన్‌లో ఆశించిన దిగుబడి రాకపోవడం,మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో శనగ రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. శనగలకు క్వింటాకు ₹8,000 చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉదయం ఉరవకొండలోని వ్యవసాయ అధికారి కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.హెచ్. రాయుడు, సహాయ కార్యదర్శి ఎన్.మధుసూదన్ మాట్లాడుతూ ఉరవకొండ డివిజన్ పరిధిలోని బెళుగుప్ప, విడపనకల్లు, వజ్రకరూర్ మండలాల్లో వేల ఎకరాల్లో శనగ సాగు జరిగిందన్నారు. అయితే అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల ప్రభావంతో మార్కెట్‌లో శనగ ధరలు రోజురోజుకు పడిపోతున్నాయని తెలిపారు. ఇదే పరిస్థితిని దళారులు దుర్వినియోగం చేసుకుంటూ సిండికేట్‌గా మారి క్వింటాకు 5 కేజీల వరకు తరుగు తీస్తూ రైతులను దోచుకుంటున్నారని మండిపడ్డారు.కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ₹5,650కు అదనంగా ₹2,350 బోనస్ కలిపి క్వింటాకు ₹8,000 చొప్పున ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కేరళ ప్రభుత్వం తరహాలో ఎంఎస్పీకి అదనంగా బోనస్ ఇచ్చే విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లోనూ అమలు చేయాలని కోరారు.అధిక తరుగు తీస్తూ రైతులను మోసం చేస్తున్న దళారులపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్‌లో ధరలు లేక గోడౌన్లలో పంటను నిల్వ చేసిన రైతుల అద్దె ఖర్చులను ప్రభుత్వమే భరించాలని, నిల్వ ఉన్న పంట పత్రాల ఆధారంగా రైతులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రబీ పంటలకు ఈ-క్రాప్ చేసిన రైతులకు రశీదులు ఇచ్చి ఉచిత పంట బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా చిన్న, సన్నకారు రైతులు పంటను నిల్వ చేసుకోలేక దళారులు చెప్పిన తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు శినప్ప,సిద్దప్ప, మురళి,విరాంజనేయులు, శివ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సూర్య కిరణాల అభిషేకం... భక్తజనుల పులకింత.



**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 05:-** ఉరవకొండ పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం అరుదైన ఆధ్యాత్మిక దృశ్యం భక్తులను ఆకట్టుకుంది. ఉదయం వేళ సూర్యుడి తొలి కిరణాలు నేరుగా స్వామివారి పాదపద్మాలను తాకడంతో ఆలయంలో భక్తి వాతావరణం నెలకొంది. ఈ దృశ్యాన్ని చూసిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.వేకువజామున స్వామివారికి నిర్వహించిన సుప్రభాత సేవ అనంతరం, గర్భగుడిలోని విగ్రహంపై సూర్య కిరణాలు పడటాన్ని భక్తులు దైవానుగ్రహంగా భావించారు. ప్రకృతి స్వయంగా స్వామివారిని అర్చించినట్లుగా అనిపించిందని భక్తులు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.సూర్య కిరణాలు స్వామివారి పాదాలను తాకిన సమయంలో భక్తులు గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని మారుమోగించారు.ఈ అరుదైన దృశ్యాన్ని దర్శించుకున్న భక్తులు తమకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగిందని తెలిపారు. నూతనంగా నిర్మించిన ఈ ఆలయంపై స్వామివారి కటాక్షం ఉందని అర్చకులు పేర్కొన్నారు.

# దర్గా హొన్నూరులో వడదెబ్బ నివారణపై ప్రజలకు అవగాహన



**బొమ్మనహల్ మన జనప్రగతి మార్చి 05:-** మండల పరిధిలోని దర్గా హొన్నూరు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రఫియా సుల్తానా ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు వడదెబ్బపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా డాక్టర్ రఫియా సుల్తానా మాట్లాడుతూ..మార్చి నుండి జూలై వరకు ఎండలు తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున రోజువారీ కూలీలు,వృద్ధులు,మహిళలు,పిల్లలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలకు టోపీ లేదా గొడుగు రుమాలలు కప్పుకోవాలని శీతల పానీయాలకంటే మజ్జిగ, కొబ్బరినీరు, ఓఆర్ఎస్ వంటి ద్రావణాలు ఎక్కువగా తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని తెలిపారు,అలాగే అనవసరంగా ఎండలో ఎక్కువగా తిరగకుండా జాగ్రత్తపడాలని,ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు ఆరోగ్య సిబ్బంది సిద్ధంగా ఉండాలని, ఓఆర్ఎస్ కార్నర్ లను ఏర్పాటు చేయాలని సూచించారు, ఎంపిహెచ్ఈఓ లక్ష్మీనాయక్,పి.హెచ్.ఎన్,సుశీలమ్మ, సూపర్వైజర్ జయభారతి,ఎంఎల్ హెచ్ పి హరినాథ్ ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో సీఎంను కలిసిన కడప జిల్లా ఏపీ ఎన్జీజీవో అధ్యక్షులు బి.శ్రీనివాసులు

**• ఉద్యోగ సమస్యల పరిష్కారమే లక్ష్యం**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 05:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ని కడప జిల్లా ఎన్జీవో జిల్లా అధ్యక్షులు బి శ్రీనివాసులు, ఏపీ ఎన్జీజీవో సంఘం రాష్ట్ర నేతలు బుధవారం నాడు అసెంబ్లీ ఆవరణలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో కలిశారు.ఫిబ్రవరి 8న రాష్ట్ర ఏపీ ఎన్జీజీవోస్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగిన నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షులు ఎ. విద్యాసాగర్,జనరల్ సెక్రటరీ డి.వి.రమణల ఆధ్వర్యంలో కడప జిల్లా అధ్యక్షులు శ్రీ బి. శ్రీనివాసులు సీఎంతో భేటీ అయ్యారు.ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అపరిష్కృత సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు.పెండింగ్ డీఏల మంజూరు,మధ్యంతర భృతి చెల్లింపు మరియు పీఆర్సీ కమిటీ నియామకం.హెల్త్ కార్డుల సమస్య పరిష్కారం,పెన్షనర్ల క్వాంటం పెన్షన్ సవరణ,సీపీఎస్ ఉద్యోగుల అంశాలు,అవుట్‌సోర్సింగ్ సిబ్బంది క్రమబద్ధీకరణ.ఆర్థిక మరియు ఆర్థికేతర అంశాల్లో ప్రభుత్వం దశలవారీగా న్యాయం చేస్తుందని రాష్ట్రంలోని ఉద్యోగులందరూ ఆశాభావంతో ఉన్నారని వారు ముఖ్యమంత్రికి వివరించారు.

# ఇనగలూరులో వ్యాధులపై అవగాహన కార్యక్రమం

### 104 సేవలతో గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు



**తొండూరు మన జనప్రగతి మార్చి 05:**–మండలంలోని ఇనగలూరు గ్రామంలో గురువారం 104 సేవల ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ వైద్య సేవల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుభాషిణి పాల్గొని గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ వ్యాధులతో పాటు రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులకు పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. గ్రామస్తులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. డాక్టర్ సుభాషిణి మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమవుతున్నందున వడదెబ్బ నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే నోటి క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్,గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి వ్యాధుల నిర్ధారణ కోసం అవసరమైతే రిమ్స్ మెడికల్ కాలేజీ, కడపకు తరలించి పరీక్షలు చేయిస్తామని తెలిపారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మల్లయ్య, సమాజ ఆరోగ్య అధికారి శిరీష,ఆరోగ్య కార్యకర్త మధుర, 104 వాహన సిబ్బంది సూరి, రవి మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


## రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్సీపీ పరిశీలకుడిగా గువ్వల శ్రీకాంత్ రెడ్డి నియామకం



**శింగనమల మన జనప్రగతి మార్చి 05:**– వైఎస్సార్సీపీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించిన పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. రాప్తాడు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా గువ్వల శ్రీకాంత్ రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ అధినేత ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన విడుదలైంది. శింగనమల నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రం ప్రాంతానికి చెందిన గువ్వల శ్రీకాంత్ రెడ్డి గతంలో జెడ్పిటిసి సభ్యుడిగా పనిచేసి, ప్రస్తుతం వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రాప్తాడు నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేయడం, క్షేత్రస్థాయిలో కేడర్‌ను బలోపేతం చేయడం, రాబోయే రాజకీయ సవాళ్లకు పార్టీని సిద్ధం చేయడం ఈ నియామకానికి ప్రధాన ఉద్దేశ్యంగా పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీ శ్రేణులను ఏకం చేస్తూ, స్థానిక సమస్యలపై పోరాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో గువ్వల శ్రీకాంత్ రెడ్డి కీలక పాత్ర పోషించనున్నట్లు నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## గురుకుల పార్ట్ టైం టీచర్ల సమస్యలను పరిష్కరించండి: ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి

**పులివెందుల అర్బన్ మన జన ప్రగతి మార్చి 05:** రాష్ట్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శాసనమండలిలో ఆయన ఈ అంశంపై గళమెత్తారు. తొమ్మిది సంవత్సరాలకు పైగా సేవలందిస్తున్న పార్ట్ టైం టీచర్లను కాంట్రాక్ట్ టీచర్లుగా మార్పు చేసి,వారికి పూర్తిస్థాయి ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రస్తుతమున్న వేతనాలను పెంచి,వారికి బేసిక్ పే వర్తింపజేయాలన్నారు. ప్రస్తుతం వీరికి ఏడాదిలో కేవలం ఎనిమిది నెలలు మాత్రమే జీతం ఇస్తున్నారని, అలా కాకుండా 12 నెలల పాటు వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దవిధి నిర్వహణలో ఉండి ప్రమాదవశాత్తు ఎవరైనా ఉపాధ్యాయులు మరణిస్తే, వారి అంత్యక్రియల ఖర్చుల (మట్టి ఖర్చులు) కోసం ప్రభుత్వమే ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.



# క్యాన్సర్ నిర్మూలనకు ముందస్తు పరీక్షలే మార్గం

### కిమ్స్ సవేరా - డాక్టర్ శరణ్య హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత శిబిరం

### ఉచిత శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### డాక్టర్ శరణ్య హాస్పిటల్ యాజమాన్యం




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 05:** పట్టణంలోని లయోలా డిగ్రీ కాలేజ్ రోడ్డులో ఉన్న డాక్టర్ శరణ్య హాస్పిటల్ మరియు కిమ్స్ సవేరా హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శనివారం (మార్చి 7) భారీ ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించనున్నారని శరణ్య హాస్పిటల్ యాజమాన్యం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను గురువారం విడుదల చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. ఈ శిబిరం యొక్క ప్రధాన ఉద్దేశం క్యాన్సర్ లక్షణాలు మరియు నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించడమేనని పేర్కొన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్,గర్భాశయ క్యాన్సర్ మరియు నోటి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించబడుతయని,నోటి క్యాన్సర్ పరీక్షలు అందుబాటులో ఉంటాయి అని తెలియజేశారు. ఈ ఉచిత శిబిరంలో అత్యాధునిక 'మొబైల్ యూనిట్' ద్వారా అవసరమైన వారికి ఉచితంగా మామోగ్రఫీ మరియు ఇతర స్క్రీనింగ్ పరీక్షలు చేసి వ్యాధి వచ్చిన తర్వాత బాధపడటం కంటే,ముందస్తు పరీక్షల ద్వారా దానిని గుర్తించి చికిత్స పొందడం సులభమని వైద్యులు సూచించారు. పులివెందుల పట్టణం మరియు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని భారీ సంఖ్యలో సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శరణ్య హాస్పిటల్ యాజమాన్యం కోరింది.

# పులివెందుల మార్కెట్లో మున్సిపల్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

● ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు ● పులివెందుల మున్సిపల్ అధికారులు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 05:**– పర్యావరణ పరిరక్షణలో భాగంగా పులివెందుల మున్సిపాలిటీ అధికారులు ప్లాస్టిక్ రహిత పట్టణమే లక్ష్యంగా చర్యలు చేపట్టారు. మున్సిపల్ ఇంచార్జి కమిషనర్ ముని కుమార్ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని వారపు సంత (మార్కెట్) నందు సచివాలయ శానిటరీ సెక్రటరీలు ఆకస్మిక దాడులు నిర్వహించారు. వారపు సంతలోని కూరగాయల అంగళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అధికారులు ప్రభుత్వంచే నిషేధించబడిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు మరియు క్యారీ బ్యాగులను భారీగా స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను వ్యాపారులకు వివరించి ,పర్యావరణానికి హాని కలిగించే వస్తువులను విక్రయించవద్దని హెచ్చరించారు. ఈ సందర్భంగా శానిటరీ సెక్రటరీలు మాట్లాడుతూ, ప్లాస్టిక్ నిషేధంపై ఇకపై ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. కేవలం వారపు సంతలోనే కాకుండా, పట్టణంలోని అన్ని వ్యాపార సముదాయాల్లో ప్రతిరోజూ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ కవర్లు వాడే వారిపై భారీ జరిమానాలు విధిస్తామని, ప్రజలు కూడా సహకరించి బట్ట సంచులను వాడాలని పిలుపునిచ్చారు.

# పత్రా సమాజ ఐక్యతకు మరో అడుగు.

● నూతన కళ్యాణమండపం,అన్నదాన సత్రం ప్రారంభం ● మార్చి 8న ఘనంగా వేడుకలు. ● ప్రత్యేక ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు. ● పత్రా సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కూనపూరి శివరామ్



**వేముల మన జనప్రగతి మార్చి 05:**– పత్ర నాయుళ్ల సమాజ ఐక్యత, సేవా తత్వం మరియు పత్ర కుల అభ్యున్నతిని ప్రతిబింబించేలా బ్రహ్మంగారిమఠంలో నూతనంగా నిర్మించిన పత్ర నాయుళ్ల కళ్యాణమండపం మరియు అన్నదాన సత్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఈ నెల మార్చి 8వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పత్రా సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కూనపూరి శివరామ్ తెలిపారు. పత్రా సమాజ సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పత్రా సంక్షేమ సంఘం గత కొంతకాలంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. విద్యా సహాయం,సామాజిక అవగాహన కార్యక్రమాలు,ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సమాజ ఐక్యతను పెంపొందించేందుకు సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ కళ్యాణమండపం పత్ర కులస్తులు వివాహాలు,శుభకార్యాలు,సామాజిక, ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అనువుగా రూపొందించబడిందని తెలిపారు. విశాలమైన ప్రాంగణం,సౌకర్యవంతమైన వసతి,తాగునీటి సదుపాయం,అన్నదాన సత్రంలో ప్రత్యేక వంటశాల వంటి అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు కూనపూరి శివరామ్ వెల్లడించారు. భక్తులకు మరియు అవసరమైన వారికి సేవ చేయాలనే ఉద్దేశంతో అన్నదాన సత్రాన్ని నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్క పత్రా కుటుంబ సభ్యులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి భారీ సంఖ్యలో హాజరై ప్రత్యేక ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## రైల్వే కోడూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల పరిశీలన



**రైల్వేకోడూరు మన జన ప్రగతి మార్చ్ 05:**– తిరుపతి జిల్లా రైల్వే కోడూరు పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి గురువారం ఉదయం అధికారులు అంచనాలను పరిశీలించారు. స్టేషన్ పరిసరాల్లో అండర్ బ్రిడ్జి, రూఫ్ నిర్మాణం, సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రవేశ ద్వారం వద్ద ఆర్చ్ లైటింగ్ తదితర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా గుంతకల్లు రైల్వే డిఆర్‌సీసీ సభ్యులు మరియు రాయలసీమ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, రైల్వే ఏడీఎన్‌తో కలిసి రైల్వే స్టేషన్‌ను పర్యటించి ప్రతిపాదిత పనుల అంచనాలను పరిశీలించారు. స్టేషన్ అభివృద్ధి ద్వారా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పర్యటనలో సంబంధిత రైల్వే అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# జనసేన ఉద్యమి "సభ్యత్వంతో భద్రతా బీమా"

● ప్రమాద మరణానికి రూ.5 లక్షల వరకు సాయం. ● వైకల్యం వచ్చినా బీమా వర్తింపు. ● సభ్యత్వానికి ప్రజలు ముందుకు రావాలి

● జనసేన పార్టీ నేత డాక్టర్ దాసరి రవిశంకర్



**వేంపల్లె,మన జనప్రగతి మార్చి 05:** సమాజంలో మార్పు తీసుకురావాలని ఆకాంక్ష ఉన్న ప్రతి ఒక్కరూ జనసేన పార్టీ నిర్వహిస్తున్న "ఉద్యమి" సభ్యత్వ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ నేత డా. దాసరి రవిశంకర్ పిలుపునిచ్చారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టిన మహా యజ్ఞంలో భాగంగా ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతోందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమి సభ్యత్వం తీసుకున్న వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా ప్రమాద బీమా సదుపాయం కల్పించబడుతుందని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణం సంభవించిన పక్షంలో రూ.5 లక్షల వరకు బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రమాదవశాత్తు రెండు కళ్ళు లేదా రెండు చేతులు, కాళ్లు కోల్పోయిన సందర్భంలో లేదా ఒక కన్నుతో పాటు ఒక చేయి లేదా కాలు కోల్పోయిన పక్షంలో కూడా రూ.5 లక్షల బీమా అందించబడుతుందని తెలిపారు. ఒక కన్ను లేదా ఒక చేయి లేదా ఒక కాలు కోల్పోయిన వారికి రూ.2.5 లక్షల బీమా వర్తిస్తుందని చెప్పారు. పూర్తిగా వైకల్యం కలిగిన సందర్భంలో కూడా రూ.5 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పించబడుతుందని వివరించారు. పులివెందుల నియోజకవర్గంలోని జనసైనికులు, వీర మహిళలు, అభిమానులు తప్పనిసరిగా ఉద్యమి సభ్యత్వాన్ని తీసుకోవాలని, అలాగే ఈ కార్యక్రమం గురించి ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని ఆయన కోరారు. ఉద్యమి సభ్యత్వం పొందదలచిన వారు 9440305962 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.


# ఉగాది రోజున లక్ష టిడ్కో ఇళ్లు లబ్దిదారులకు అందజేస్తాం

### దేశంలో ఎక్కడా జరగనంత భారీగా గత ప్రభుత్వంలో టీడీఆర్ స్కాం జరిగింది

### గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లు మూసేసి పేదల కడుపు కొట్టింది

### రాష్ట్రంలో త్వరలో మరో 6 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లు ఏర్పాటు

### అసెంబ్లీలో మంత్రి నారాయణ




**అమరావతి మన జనప్రగతి మార్చి 05:**– వచ్చే ఉగాది రోజు రాష్ట్రంలో లక్ష మంది లబ్దిదారులకు టిడ్కో ఇళ్లు అందజేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. జూన్ నాటికి టిడ్కో ఇళ్ల ను పూర్తి చేయడంతో పాటు 2028 కల్లా ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని మంత్రి చెప్పారు ముఖ్యమంత్రి సలహాలు,సూచనలతో పురపాలక మరియు పట్టణాభివృద్ది శాఖ ద్వారా ప్రజలకు విస్తృతంగా మెరుగైన సేవలు అందిస్తున్నామని అన్నారు.. శాసనసభలో సాధారణ బడ్జెట్ డిమాండ్స్ పై చర్చ సందర్భంగా తన శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై మంత్రి వివరణ ఇచ్చారు పట్టణ ప్రాంతాల్లో జనాభా రోజురోజుకూ పెరుగుతుందని 2001 లో 24.2 శాతం జనాభా ఉంటే 2011 నాటికి ప్రస్తుతం 36 శాతం ఉన్నదని...2047 నాటికి ఇది 60 శాతానికి పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ అంచనాలకు అనుగుణంగా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు..2014-19 మధ్య కాలంలో మున్సిపాల్టీల నుంచి పన్నుల రూపంలో వచ్చే నిధులను గ్రీన్ ఛానల్ ద్వారా ఆయా మున్సిపాల్టీలకే ఖర్చు పెట్టామన్నారు..కానీ గత ప్రభుత్వం మున్సిపాల్టీల నిధులను కూడా సొంత అవసరాలకు వినియోగించేసుకుందన్నారు..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని తిరిగి సీఎఫ్‌ఎంఎస్ తో సంబంధం లేకుండా మున్సిపాల్టీల నిధులు అక్కడే ఖర్చు చేసుకునేలా మార్పులు చేసారని అన్నారు సీఎం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రజల తరపున ఆయనకు ధన్యవాదాలు చెప్పారు మంత్రి నారాయణ.. ఈ బడ్జెట్ లో మున్సిపల్ శాఖకు 14,538.68 కోట్లు కేటాయింపులు చేసారని..గత బడ్జెట్ కంటే ఇది 4.88 శాతం ఎక్కువ అన్నారు..ప్రజలు కోరుకునే తాగునీరు,ఘన,ద్రవ వ్యర్థాల నిర్వహణ,రోడ్లు,వీధి లైట్లతో పాటు ఇతర అవసరాలను ప్రాధాన్యతాక్రమంలో కల్పిస్తున్నామన్నారు నారాయణ...రాష్ట్రంలో 54,98,000 కొళాయి కనెక్షన్లు ద్వారా 3083 ఎంఎల్డీ తాగునీరు అందించాల్సి ఉండగాఅప్రస్తుతం 38.48 లక్షల కనెక్షన్ల ద్వారా 2100 ఎంఎల్టీ నీరు అందిస్తున్నామన్నారు మరో 16.5 లక్షల కనెక్షన్ల ద్వారా 983 ఎంఎల్డీ తాగు నీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు...వీటిలో వివిధ పథకాల ద్వారా 941 ఎంఎల్డీల తాగు నీరు అందించేలా టెండర్లు పిలిచామన్నారు...అమృత్ పథకం ద్వారా 6,524 కోట్లతో ఏఐఐబీ ప్రాజెక్ట్ ద్వారా 2,461 కోట్లతో,యూఐడీఎఫ్ - 1 పథకం ద్వారా 1504 కోట్లతో పనులు ప్రారంభించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని మంత్రి నారాయణ చెప్పారు. మొత్తంగా 11,937 కోట్లతో ప్రాజెక్ట్ చేపట్టినట్లు మంత్రి నారాయణ చెప్పారు 2024 అక్టోబర్ లో గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల ప్రకారం ఏడాదిలోగా 85 లక్షల టన్నుల లెగసీ వేస్ట్ ను తొలగించామని వచ్చే జూన్ నాటికి మిగిలిన 68 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను పూర్తిగా తొలగిస్తామని చెప్పారు...2014-19 మధ్యలో రాష్ట్రంలో 10 చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించగా...గత ప్రభుత్వం కేవలం విజయవాడ,విశాఖపట్నం మినహా మిగిలిన ప్రాజెక్ట్ లను పట్టించుకోలేదన్నారు...ప్రస్తుతం ఈ రెండు ప్లాంట్ల నుంచి 2800 టన్నుల చెత్తను విద్యుత్ గా మారుస్తున్నామని....కాకినాడ,నెల్లూరు,కడప,కర్నూలులో కొత్తగా ప్లాంట్ల నిర్మాణం జరుగుతుందన్నారు...వీటితో పాటు విజయవాడ,తిరుపతిలో ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్రంతో చర్చలు జరుపుతున్నామన్నారు...ఈ ప్రాజెక్ట్ లు పూర్తయితే రాష్ట్రంలో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే 7000 టన్నుల ఘన వ్యర్థాలలో 6500 టన్నులు విద్యుత్ గా మారిపోతుందన్నారు...ఈ ప్లాంట్లు పూర్తయ్యే లోగా ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు ఏర్పాటుచేస్తామని చెప్పారు. రాష్ట్రంలోని మున్సిపాల్టీల్లో దేశంలోనే మొదటిసారిగా విశాఖపట్నంలో 99,000 వీధి లైట్ల ను ఎల్ ఈడీ లైట్లుగా మార్చినట్లు మంత్రి నారాయణ తెలిపారు. 2014-19 మధ్యలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు టిడ్కో ద్వారా 7 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు తీసుకురాగా....3.8 లక్షల ఇళ్లు నిర్మాణం ప్రారంభమైంది...కానీ గత ప్రభుత్వం ఆ సంఖ్యను 2,61,000కు తగ్గించడమే కాకుండా వాటిని కూడా పూర్తి చేయకుండా మధ్యలో నిలిపివేసింది..ఇళ్లు నిర్మాణం ప్రారంభించిన కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టింది..పాత కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించలేదని మంత్రి తెలిపారు...ప్రస్తుతం టిడ్కో ఇళ్లను పూర్తి చేసేందుకు హడ్కో ద్వారా రుణం తీసుకున్నామన్నారు..టిడ్కో ఇళ్లలో 365,430 చదరపు అడుగుల విస్తీర్ణంలో పెండింగ్ లో ఉన్న ఇళ్లను వచ్చే జూన్ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. వచ్చే ఉగాది నాటికి లక్ష టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్దిదారులకు అందిస్తామని మంత్రి చెప్పారు అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయని మూడేళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు...ఎంఎల్ ఏ,ఎంఎల్ సి క్వార్టర్ల నిర్మాణాలను ఏప్రిల్ చివరికి పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
06 -03-2026


# సాయినాథుని ఆలయంలో విశేష పూజలు

**● ప్రత్యేక అలంకారంలో సాయినాథుడు ● ఆలయ అభివృద్ధికి సహకరించండి.**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 05:–** పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపంలో మొట్టమొదటిగా కొలువైన శ్రీ శిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం షిరిడి సాయిబాబా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయాస్తమాన స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో సాయినాధునికి ఉదయం కాగడ హారతి, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి,తదితర పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్నం హారతి సాయంకాలం 6 గంటలకు సంధ్య హారతి రాత్రి 9 గంటలకు శేజ హారతులు స్వామివారికి అర్పించారు.ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడుతూ ప్రతి గురువారం ఆలయంలో భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాలు విశేషంగా నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ప్రతి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతోందని తెలియజేశారు.**ఆలయ అభివృద్ధికి సహకరించండి.** ఆలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధిలో భాగంగా కళ్యాణ మండపం గదులు వంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది ఎవరైనా దాతలు ముందుకు వచ్చి షిరిడి సాయి బాబా ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య పిలుపునిచ్చారు. సహాయ సహకారాలు అందించిన దాతల పేర్లు ఆలయంలో శిలా పథకం వేయించి శాశ్వతంగా ఉండే విధంగా చర్యలు చేపడతారని, ప్రతి సంవత్సరం గురు పౌర్ణమి లో దాతలకు విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో షిరిడి సాయి సేవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది పురస్కారాలకు డా: బి.యస్ శర్మకు ఆహ్వానం



**రైల్వేకోడూరు మన జన ప్రగతి మార్చి 05:–** రైల్వే కోడూరులో సమాజ సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక సేవలలో విశేష కృషి చేస్తున్న రైల్వేకోడూరు ప్రాంతానికి చెందిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ ధర్మకర్త డాక్టర్ బండాత్మకూరు సుదర్శన శర్మకు న్యూఢిల్లీలో నిర్వహించనున్న ఉగాది పురస్కారాల కార్యక్రమానికి ఆహ్వానం అందింది. ఈ విషయాన్ని సుదర్శన శర్మ గురువారం ఒక ప్రకటన ద్వారా విలేకరులకు తెలిపారు.న్యూఢిల్లీలోని ఆది లీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఉగాది సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు పురస్కారాలు అందజేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ క్రమంలో రైల్వేకోడూరులో ఆధ్యాత్మిక, సామాజిక సేవల ద్వారా విశేష సేవలందిస్తున్న డాక్టర్ బండ ఆత్మకూరు సుదర్శన శర్మ సేవలను గుర్తించి ఈ ఏడాది ఉగాది పురస్కారాలకు ఆయనను ఆది లీల ఫౌండేషన్ ప్రతినిధులు ఆహ్వానం పలికినట్లు ఆయన తెలిపారు.ప్రత్యేకంగా రైల్వేకోడూరులో శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం, ఆలయ అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు సౌకర్యాల కల్పనతో పాటు పలు ధార్మిక, సేవా కార్యక్రమాలను సుదర్శన శర్మ నిర్వహిస్తూ ప్రజల ప్రశంసలుఅందుకుంటున్నారు. ఈ సేవలను గుర్తించి ఆది లీల ఫౌండేషన్ అధ్యాపకులు శ్రీ ఆదినారాయణ ఆయనను వ్యక్తిగతంగా సంప్రదించి ఉగాది పురస్కార కార్యక్రమానికి ఆహ్వానించినట్లు సుదర్శన శర్మ తెలిపారు.ఇలాంటి గౌరవం లభించడం తనకు ఆనందంగా ఉందని, ఇది తనపై ఉన్న బాధ్యతను మరింత పెంచిందని సుదర్శన శర్మ పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని ఆయన తెలిపారు. రైల్వేకోడూరు ప్రాంత ప్రజల ఆశీస్సులు, సహకారంతోనే తాను ఈ సేవలను కొనసాగిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య..!

**● పంటలకు గిట్టుబాటు ధరలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ● ఐదు బోర్లు వేయించి రూ.12 లక్షలకు పైగా అప్పులు ● ఇద్దరు చిన్నారులతో భార్య దిక్కుతోచని స్థితి**



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 05:–** మండలంలోని బక్కన్నగారి పల్లె గ్రామంలో అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చోటుచేసుకుంది. బంధువులు,కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు బక్కన్నగారి పల్లె గ్రామానికి చెందిన రెడ్డి బోయిన సత్యనారాయణ కుమారుడు సూర్యనారాయణ (30)కు సుమారు 2.50 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ పొలంలో అరటి, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలను సాగు చేస్తూ జీవనం సాగించేవాడు.అయితే గత కొంతకాలంగా భూగర్భ జలాలు తగ్గిపోవడంతో తన పొలంలో ఐదు బోర్లు వేయించగా,వాటికి సుమారు రూ.12 లక్షలకు పైగా అప్పులు చేశాడు. పంటలు పండించి అప్పులు తీర్చాలన్న ఆశతో సాగు చేసినా దిగుబడి ఆశించినంతగా రాకపోవడం,పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు.ఈ పరిస్థితుల్లో అప్పులు తీర్చలేమన్న మనస్తాపంతో గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కళ్యాణి,ఐదేళ్ల కుమారుడు భాను ప్రకాష్, మూడేళ్ల కుమారుడు రుషేంద్ర ఉన్నారు.భార్య కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేది. కుటుంబ పోషకుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు,బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రంజాన్ అంటే త్యాగం క్రమశిక్షణకు నిదర్శనం: పొంగూరు రమాదేవి

**● 48వ డివిజన్ ఇఫ్తార్ విందులో పాల్గొన్న రమాదేవి**

**● ప్రేమ, శాంతి, సహనం.. ఇదే రంజాన్ సందేశం**



**నెల్లూరు మన జనప్రగతి మార్చి 05:–** 48వ డివిజన్ పరిధిలోని మీరామొద్దీన్ దర్గా కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భానుడి భగభగలను సైతం లెక్కచేయకుండా ముస్లింలు పాటించే కఠిన ఉపవాస దీక్షలు వారి అచంచల భక్తికి, క్రమశిక్షణకు నిదర్శనమని కొనియాడారు. రంజాన్ అంటే కేవలం ఉపవాసం మాత్రమే కాదని, అది త్యాగానికి, 'జకాత్' వంటి సేవా గుణాలకు ప్రతీక అని పేర్కొన్నారు. అభివృద్ధికి కులం, మతం ఉండవని.. అందరి మేలే లక్ష్యంగా మంత్రి నారాయణ నిరంతరం శ్రమిస్తున్నారని, మైనారిటీల సంక్షేమానికి తాము ఎప్పుడూ కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. మన గంగా–జమునా తెహజీబ్ (మత సామరస్యం) ఇలాగే వర్ధిల్లాలని, అల్లాహ్ దీవెనలతో అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆమె మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, 42వ డివిజన్ కార్పొరేటర్ కరిముల్లా,48వ ఇంచార్జి కీర్తి, డిస్టిక్ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ మైనుద్దీన్,డివిజన్ కొక్లస్టర్ జాఫర్,స్టేట్ మైనార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నౌషాద్,నసీమ,యూనస్,ముజీవ్,ఉస్మాన్, స్థానిక టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వ నమోదులో కార్యకర్తలు మరింత చురుకుగా ఉండాలి



**కాకినాడ మన జనప్రగతి మార్చి 05:–** జనసేన పార్టీ సభ్యత్వ నమోదులో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత భాగస్వాములు అయ్యి కాకినాడ పార్లమెంటు నియోజకవర్గాన్ని మొదటి స్థానం నిలిపేందుకు కృషి చేయాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం కాకినాడ క్యాంపు కార్యాలయంలో జగ్గంపేట, తుని, ప్రత్తిపాడు నియోజకవర్గాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, సాధక్ లతో సమావేశం నిర్వహించి సభ్యత నమోదుపై సమీక్షించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జనసేన పార్టీ గ్రామస్థాయి నుండి బలోపేతం అవుతుందన్నారు, పార్టీ సిద్ధాంతాలు ఆశయాలకు ఆకర్షితులై అనేకమంది పార్టీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని తెలిపారు. ఫిబ్రవరి 26 నుండి ప్రారంభమైన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమంలా సాగుతుందన్నారు. ఆయా నియోజకవర్గాల్లో సాధక్ లు అంకితభావంతో పనిచేసి ఇంటింటికి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను వివరించి సభ్యత్వ నమోదులో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఇప్పటికే సభ్యత్వ నమోదులో రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, ఇదే స్ఫూర్తితో కాకినాడ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంగా పనిచేయాలని కోరారు. ఇతర పార్టీలకు భిన్నంగా పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు గౌరవం, గుర్తింపుతో పాటు భీమా రక్షణ ఇస్తున్న ఏకైక పార్టీ జనసేన పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి అధ్యక్షులు, జిల్లా జనసేన పార్టీ తుమ్మల బాబు, జగ్గంపేట ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్(బాబీ), పార్టీ నాయకులు నల్లం వాసు, బార్లపూడి క్రాంతి, చోడిశెట్టి గణేష్, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# సెజ్ భూములు రైతులకు తిరిగి అప్పగించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ షాన్ మోహన్



**కాకినాడ మన జనప్రగతి మార్చి 05:–** కాకినాడ జిల్లాలో సెజ్‌కు చెందిన భూములను తిరిగి రైతుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేసి ఆయా రైతులకు అప్పగించే ప్రక్రియ కొనసాగుతున్నదని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి తెలిపారు. గురువారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్'తో కలిసి రెవెన్యూ, సెజ్, రిజిస్ట్రేషన్ ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మాట్లాడుతూ కాకినాడ రూరల్, యు కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలో భూమిని సెజ్ పరిధిలోకి ప్రభుత్వం తీసుకుందన్నారు. ఈ భూములను అర్హత గల రైతుల వారి పేర్లపై తిరిగి రిజిస్ట్రేషన్ చేయించే చర్యలను ప్రభుత్వం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ భూములకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రత్రాలపై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు ఇచ్చినట్లు కలెక్టర్ చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులు తమ భూములు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, దస్తావేజులు, ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే నోటీసుల వివరాలు అన్ని మార్చి 13 నాటికి ఆయా మండలాల తహశీల్దార్ల కార్యాలయంలో సమర్పించాలన్నారు. సెజ్ భూములు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి రెవెన్యూ, సెజ్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సెజ్ భూములు రైతులు పేరును బదిలీ చేసే ప్రక్రియ సజావుగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ డి తిప్పేనాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, ఎన్ శ్రీధర్, జిల్లా రిజిస్టర్ కె ప్రసాద్ రావు, కాకినాడ రూరల్, తొండంగి, యు కొత్తపల్లి మండలాల తహశీల్దార్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మగ్గం మీదే నేసే వస్త్రాలనే కొనుగోలు చేస్తాం



**ఎమ్మెల్యేలు, అధికారులతో కీలక భేటీ**

**చేనేత రంగ అభ్భిద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం : మంత్రి సవిత**

**అమరావతి మన జన ప్రగతి మార్చి 05:–** మగ్గం మీదే నేసే వస్త్రాలను మాత్రమే ఆప్కో ద్వారా కొనుగోలు చేస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. ఆప్కో బ్రాండ్ మరింత పెంచేలా షో రూమ్ ల్లో నాణ్యమైన చేనేత వస్త్రాలను మాత్రమే విక్రయించనున్నామన్నారు. గురువారం విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్ లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 70 చేనేత సహకార సంఘాల ప్రతినిధులతో రాష్ట్ర చేనేత, జౌళి శాఖాధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రూ.కోటీ 70 లక్షల విలువైన చేనేత వస్త్రాలను ఈ సమావేశానికి చేనేత సహకార సంఘాల ప్రతినిధులు తీసుకొచ్చారు. వాటిని పరిశీలించిన అధికారులు, కేవలం మగ్గంపైనే నేసిన రూ.కోటీ 40 లక్షల విలువైన చేనేత వస్త్రాలను అక్కడికక్కడే కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ఆప్కో బ్రాండ్ ను మరింత విస్తరించే క్రమంలో ఆయా షో రూమ్ ల్లో కేవలం మగ్గం మీద నేసే చేనేత వస్త్రాలను మాత్రమే విక్రయించనున్నామన్నారు. పవర్ లూమ్ మగ్గాల మీద నేసే వస్త్రాలను ఆప్కో షో రూమ్ ల్లో విక్రయించేది లేదని స్పష్టం చేశారు. దీనిలో భాగంగానే మగ్గం మీద నేసే చేనేత వస్త్రాలను మాత్రమే చేనేత సహకార సంఘాల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. ఈ నిర్ణయం వల్ల నేతన్నలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఏడాది పాటు ఉపాధి లభించే అవకాశం కలుగుతుందన్నారు. అదే సమయంలో వినియోగదారులకు నేతన్నలు నేసే నాణ్యమైన చేనేత వస్త్రాలు లభిస్తాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆప్కో షో రూమ్ ల్లో పవర్ లూమ్ చేనేత వస్త్రాలను విక్రయించిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. ఇకపై ఆప్కో ఇమేజ్ పెంచేలా నేటి ట్రెండ్ కు అనుగుణంగా నేతన్నలు చేనేత రెడీమేడ్ దుస్తుల తయారీపైనా దృష్టి పెట్టాలన్నారు. ఆసక్తి కలిగిన వారికి ఉచిత శిక్షణ సైతం అందిస్తున్నామన్నారు. ఇప్పటికే ఈ కామర్స్ ద్వారా ఆన్ లైన్ అమ్మకాలు ప్రారంభించామని, ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మంత్రి సవిత వెల్లడించారు. **చేనేత సమస్యలపై కీలక భేటీ** చేనేత రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. దీనిలో భాగంగా నేతన్నల సమస్యల పరిష్కారంతో చేనేత రంగ అభివృద్ధిపై ఎమ్మెల్యేలు జయనాగేశ్వరరెడ్డి, జోగేశ్వరరావు, కృష్ణప్రసాద్, షాజహాన్ బాషాతో పాటు ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, అధికారులతో మంత్రి సవిత గురువారం రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ భేటీ అయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 20 నెలల కాలంలో చేనేతల అభివృద్ధికి చేపట్టిన పథకాలను మంత్రి సవిత వివరించారు. నూతన టెక్స్ టైల్స్ విధానం రూపకల్పనతో రాష్ట్రంలో చేనేత రంగానికి కొత్త శకం మొదలైందన్నారు. నేతన్నల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఈ సందర్భంగా పలు చేనేత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి సవితకు ఎమ్మెల్యేలు వినతి పత్రాన్నిఅందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రధాన ముఖ్యకార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

మన
జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
06 -03-2026

# భూసేకరణ, పరిహార పంపిణీ ప్రక్రియను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




**కడప టౌన్ మన జనప్రగతి మార్చి 05:–** జాతీయ రహదారుల విస్తరణ, సోలార్ పార్కుల ఏర్పాటు కోసం చేపట్టిన భూసేకరణ, పరిహార పంపిణీ ప్రక్రియలను పెండింగ్ లేకుండా.. పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర రాజధాని నుండి రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, రాష్ట్ర భూ పరిపాలనా శాఖ (సీసీఎల్ఏ) ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మితో కలిసి.. నేషనల్ హైవేల విస్తరణ, నిర్మాణం కోసం భూసేకరణ చేసినప్పుడు, భూ యజమానులకు చెల్లించే పరిహారానికి (ఊూహాహీూ) సంబంధించి సంబంధిత జిల్లాల కలెక్టర్లు, జేసీ లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరితో పాటు.. జేసీ డా. నిధి మీనా హాజరయ్యారు.విసి ముగిసిన అనంతరం రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సీసీఎల్ఏ ముఖ్య కార్యదర్శి వారి సూచనల మేరకు.. జిల్లాలో చేపట్టిన అన్ని రకాల భూసేకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. దేశంలో రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయన్నారు. జాతీయ రహదారులు, ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం అధికారులు భూసేకరణ చేసినప్పుడు, భూ యజమానులకు పరిహారం చెల్లించే ప్రక్రియలో భాగంగా భూసేకరణ కారణంగా భూ యజమానులు ఎదుర్కొనే నష్టాలకు పరిహారం చెల్లించడం, భూసేకరణ తర్వాత భూ యజమానులకు నిర్వహణ భత్యం చెల్లించడం, భూసేకరణ కారణంగా ప్రభావితమైన భూ యజమానులకు పరిహారం చెల్లింపునకు గల అర్హతలను రెవెన్యూ యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా చేపట్టాలన్నారు. జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు, అటవీ శాఖకు చెందిన పలు భూములను కొనుగోలు చేసి.. భూములు కోల్పోయినవారికి పరిహారం కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. జాతీయ రహదారులు, రైల్వే లైన్ల నిర్మాణం, వాటి అభివృద్ధికి అదనంగా చేపడుతున్న భూసేకరణ పనులను వేగవంతం చేయడం జరుగుతోందన్నారు. రోడ్డు విస్తరణ, నెడ్ క్యాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎనర్జీ ప్రాజెక్టు పనులకు సంబంధించిన ప్రతిపాధనలు, అనుమతులకు సంబంధించిన ఫైళ్లను రెవెన్యూ అధికారులు వేగవంతం చేయాలన్నారు. ఇంకా ఇంకనూ పెండింగ్ లోవున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విసి కార్యక్రమంలో కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి ల్యాండ్ సర్వే శాఖ అధికారులు, సంబంది సెక్షన్ సూపరింటెండెంట్లు, రెవెన్యూ అధికారులు సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అరటి పంటకు మంచి ధరలు..రైతులు తొందరపడొద్దు..!



చాగలేరు గ్రామంలో అరటిపంట కోత పరిశీలించిన ఉద్యాన శాఖ అధికారులు.

**టన్నుకు రూ.20 వేలతో శ్రీనగర్‌కు అరటి రవాణా.**

**గెలలకు తొడుగులు కడితే నాణ్యత పెరుగుతుందని సూచన.**

**వేముల మన జనప్రగతి మార్చి 05:–** వేముల మండల పరిధిలోని స్థానిక చేగాలేరు గ్రామానికి చెందిన రైతు బొగ్గుల భాస్కర్ రెడ్డి సాగుచేసిన అరటిపంట కోతను గురువారం ఉదయం జిల్లా ఉద్యాన శాఖ అధికారులు పరిశీలించారు.జిల్లా ఉద్యాన అధికారి జి.సతీష్,ఉద్యాన సహాయ సంచాలకులు రవిచంద్రబాబు, పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్ర రెడ్డి లు రైతు పొలాన్ని సందర్శించి అరటిపంట పరిస్థితి,దిగుబడి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రైతు బొగ్గుల భాస్కర్ రెడ్డి తన పొలంలో పండించిన అరటిపంటను వ్యాపారస్తుల ద్వారా కోత కోయించి టన్నుకు సుమారు..రూ.20 వేల ధరకు శ్రీనగర్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు.పంట నాణ్యత బాగుండటంతో వ్యాపారస్తులు మంచి ధరకు కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన అధికారి జి.సతీష్ మాట్లాడుతూ...ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో అరటి ఎగుమతులు కొంత మేర ప్రభావితమయ్యాయని తెలిపారు.ముఖ్యంగా ఇజ్రాయిల్ – ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల వల్ల కొన్ని దేశాలకు ఎగుమతులు తాత్కాలికంగా నిలిచిపోయినప్పటికీ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం మార్కెట్లో అరటిపంటకు టన్నుకు రూ.14 వేల నుంచి రూ.20 వేల వరకు ధర లభిస్తోందని వివరించారు.రైతులు తొందరపడి తక్కువ



ధరలకు పంటను విక్రయించకుండా కొంత సమయం వేచి చూడాలని,త్వరలోనే ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని సూచించారు. మంచి నాణ్యత ఉన్న అరటి గెలలకు వ్యాపారస్తులు అధిక ధర చెల్లిస్తున్నా రని తెలిపారు.అరటి గెలల నాణ్యత పెంపొందించేందుకు రైతులు గెలలకు తొడుగులు కట్టడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.ఇందుకు ఉద్యాన శాఖ ద్వారా హెక్టారుకు రూ.25,500 వరకు సబ్సిడీ అందజేస్తున్నట్లు తెలిపారు.రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఈ పరిశీలనలో ఉద్యాన శాఖ సిబ్బంది,స్థానిక రైతులు పాల్గొన్నారు.

# 8న ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు: మంత్రులు సవిత, సంధ్యారాణి

**● హాజరుకానున్న సీఎం చంద్రబాబు ● మహిళల ఉపాధి కల్పనే లక్ష్యం 36 ఎంవోయూలు ● నాలుగు ఎన్ఆర్ఎల్ఎం క్లస్టర్ల ప్రారంభం**



**అమరావతి మన జనప్రగతి మార్చి 05:–** ఈ నెల 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రులు ఎస్.సవిత, గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. అమరావతిలోని పేరెడ్స్ గ్రౌండ్ లో జరగనున్న ఈ వేడుకల సందర్భంగా మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా 36 ఎంవోయూలు చేసుకోనున్నట్లు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సెర్ప్, చేనేత, జౌళి శాఖ, సీఆర్డీయే, గుంటూరు జిల్లా అధికారులతో మంత్రులు సవిత, సంధ్యారాణి సమావేశం నిర్వహించారు. అమరావతిలోని పేరెడ్స్ గ్రౌండ్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ వేడుకలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబునాయుడు హాజరు కానున్నారన్నారు. ఈ సందర్భంగా మహిళలకు మేలు కలిగేలా పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టనున్నారన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలు తీర్చిదిద్దే క్రమంలో పలు ఒప్పందాలు చేసుకుంటున్నట్లు మంత్రి సవిత తెలిపారు. సీఎం సమక్షంలో 36 ఒప్పందాలు చేసుకోబోతున్నట్లు వెల్లడించారు. డ్వాక్రా మహిళలతో ల్యాప్ టాప్ బ్యాగులు, క్యారీ బ్యాగులు, రెడీ మేడ్ దుస్తుల తయారీకి శిక్షణివ్వడదానికి సెర్ప్ తో ఆప్కో ఒప్పందం చేసుకోనున్నట్లు తెలిపారు. సీఎం చేతుల మీదుగా నాలుగు ఎన్ఆర్ఎల్ఎం క్లస్టర్లను ప్రారంభించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఎమ్మిగనూరు(కర్నూలు), చీరాల(బాపట్ల), రాజాం(విజయనగరం), పొందూరు(శ్రీకాకుళం)లో ఈ క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. మహిళా దినోత్స వేడుకల సందర్భంగా 23 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా డ్వాకా మహిళా సంఘాలకు రుణాల అందజేయనున్నామన్నారు. మిల్లెట్ కార్ట్ లు 2, ఎగ్ కార్ట్ లు 5, రైతు బజారు వ్యాన్ 1, బొలెరో వాహనాలు రెండు, ఆటోలు 5, ట్రాక్టర్లు 5, ర్యాపిడో ద్విచక్ర వాహనాలు 5 మహిళ లబ్ధిదారులకు సీఎం చంద్రబాబునాయుడు అందజేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు, ఫ్రీ బస్, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాలు అమలు చేశామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రధాన ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖా రాణి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్య కుమారి, సీఆర్డీయే అడిషనల్ కమిషనర్ భార్గవ్ తేజ, గుంటూరు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాణాసంచా కేంద్ర యజమానులు అరెస్టు

**● వారి ఆస్తుల స్వాధీనానికి చర్యలు**

**● నిబంధనలు కచ్చితంగా పాటించాలి: ఎస్పీ బిందు మాధవ్ వెల్లడి**



**కాకినాడ, మన జనప్రగతి మార్చి 05:–** రాష్ట్రంలో సంచలనం కలిగించి సుమారు 28 మందికి పైగా మృతులకు కారణమైన బాణాసంచా యజమానులను అరెస్టు చేసామని కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ వెల్లడించారు. వీరికి సంబంధించిన ఆస్తులపై సంబంధిత తహశీల్దార్, సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు తెలియజేశామని పూర్తి వివరాలు వచ్చిన తర్వాత వాటిని స్వాధీనం చేసుకుని మృతులు, బాధిత కుటుంబాల వారికి ఇచ్చేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. అలాగే కాకినాడ జిల్లాలో నిబంధనలు పాటించని, అనుమతించిన దానికంటే అధికంగా నిల్వ చేసిన బాణాసంచా కేంద్రాల తయారీదారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని లేని పక్షంలో ఆ కేంద్రాలు మూసివేయడం కాకుండా వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. గురువారం కాకినాడలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి బిందు మాధవ్ విలేకరులతో సమావేశం నిర్వహించి సామర్లకోట మండలం వేట్లపాలెంలోని సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ కేంద్రంలో బాణాసంచా పేలిన దుర్ఘటనలో యజమానులైన అడబాల అర్జున్ , అడబాల వీరబాబు వారి తండ్రి అడబాల శ్రీనివాసరావు (దుర్ఘటనలో చనిపోయారు)లపై కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ కేసులో ఇప్పటివరకు 28 మంది చనిపోగా, దుర్ఘటన జరిగిన స్థలంలోనే 20 మంది చనిపోవడం చాలా దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. పరిమితికి మించి ముడి సరుకు కొనుగోలు చేయడమే కాకుండా అధిక శాతంలో నిల్వ పెట్టుకోవడంతో ఇది ప్రమాదవశాత్తు పేలి పోయి ఉండవచ్చని అనుకుంటున్నట్లు వెల్లడించారు. దీనిపై పూర్తి విచారణ నివేదిక రానుందని త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు. బాణాసంచా తయారు చేసే కేంద్రానికి గడువు ఈ ఏడాది మార్చి 37వ తేదీతో ముగుస్తుందని అందువల్ల వీరు అధిక శాతంలో తయారుచేసి విక్రయించాలనే ఉద్దేశంతో ప్లాస్టిక్ జువ్వ గుల్లలు, ప్లాస్టిక్ చిచ్చుబుడ్డి గుల్లలలో మందు గుండు పదార్థాలను అధికంగా నింపారన్నారు. ఈనెల మూడో తేదీన జగ్గంపేట మండలం మల్లిసాలలో జరిగే సింగారమ్మ తల్లి జాతరకు మందు గుండు సామాను అధికంగా ఆర్డర్ రావడం వల్ల ఎక్కువ సామాను కాల్చాలని నిర్ణయించి భారీగా ఈ తయారుచేసి పెట్టినట్లు ఎస్పీ వెల్లడించారు. అధిక ఆర్డర్లు రావడం, లైసెన్స్ గడువు సమీపించడం, నిబంధనలు పాటించకపోవడం, అధిక మోతాదులో ముడి పదార్థాలు నిల్వ చేయడం, అనుభవం లేని కార్మికులని ఎక్కువ సంఖ్యలో నియమించడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టుగా ప్రాథమిక విచారణలో తేలిందని చెప్పారు. ఈ దుర్ఘటనపై సామర్లకోట మండల తహశీల్దార్ కె చంద్రశేఖర్ రెడ్డి ఫిర్యాదు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బాణాసంచా తయారీ కేంద్ర నిర్వాహకులు అడబాల అర్జున్, అడబాల వీరబాబులు గురువారం మధ్యాహ్నం సామర్లకోట రైల్వే గూడ్స్ షెడ్డు వద్ద రైలులో వెళ్లేందుకు వేచి ఉండడంతో గమనించిన పోలీసులు వారిని అరెస్టు ఎస్పి బిందు మాధవ్ చెప్పారు. వీరిని కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పెద్దాపురం డీఎస్పీ కేవీవీ సత్యనారాయణ, సామర్లకోట సీఐ ఎకె క్రిష్ణ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా యూత్ వింగ్ సెక్రటరీగా దూదేకుల లాలుస్వామి



**బొమ్మనహల్ మన జనప్రగతి మార్చి 05:–** అనంతపురం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ వింగ్ సెక్రటరీగా పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి,రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో కనేకల్ మండలం హనుమాపురం గ్రామానికి చెందిన దూదేకుల లాలుస్వామి ఎంపికయ్యారు. లాలుస్వామి మాట్లాడుతూ..తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి నియోజక వర్గం నేతలకు మండల నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రజలకు సేవ చేయడానికి ముందుండి కృషి చేస్తానని లాలుస్వామి తెలిపారు.ఈ సందర్భం గా జిల్లా యూత్ వింగ్ సెక్రటరీగా లాలుస్వామి ఎంపికపై పలువురు నియోజకవర్గ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి..11 మంది అరెస్ట్



**బొమ్మనహల్ మన జనప్రగతి మార్చి 05:–** బొమ్మనహాల్ మండల సబ్ ఇన్స్పెక్టర్ నబిరసూల్ వారి సిబ్బందితో కలసి గురువారం మధ్యాహ్నం కురువల్లి గ్రామ శివారులో గుట్టు చప్పుడు కాకుండా ఆడుతున్న పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు,పేకాట ఆడుతున్న వారిలో 11 మందిని అదుపులోకి తీసుకున్నారు,వారి వద్ద నుండి రూ.21,250 నగదు మరియు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సబ్ ఇన్స్పెక్టర్ తెలిపారు.

# ఉద్యోగుల సంక్షేమమే మా లక్ష్యం: మంత్రి సవిత




**అమరావతి మన జనప్రగతి మార్చి 05:–** ఉద్యోగులతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ,చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఎలక్ట్రిసిటీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీని మంత్రి సవిత గురువారం రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వ పథకాల అర్హులకు చేరవేయడంలో ఉద్యోగులదే ప్రధాన పాత్ర అని అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులను వేధిస్తే, కూటమి ప్రభుత్వం వారిని అక్కున చేర్చుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జీతాల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. తమ ప్రభుత్వం రాగానే ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఉద్యోగుల సమస్యలపై సీఎం చంద్రబాబుకు పూర్తి అవగాహన ఉందన్నారు. అనంతరం బీసీ ఎలక్ట్రిసిటీ ఉద్యోగ సంఘ నేతలు మంత్రి సవితను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వి.అనురాధ, వి.గుణవంతుడు, సురేశ్, సతీష్ సహా పలువురు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174